మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 14-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 285 Issue: 285

14 ఏప్రిల్ 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:04 సూర్యాస్తమయం - సా. 6:28 తిథి ద్వాదశి రా. 12:08ం వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం శతభిష మ. 3:52 వరకు తరువాత పూర్వాభాద్ర యోగం శుక్ల మ. 3:26 వరకు కరణం కౌలవ మ. 12:41 వరకు తైతుల రా. 12:08ం వరకు వర్జ్యం రా. 10:17 నుండి రా. 11:50 వరకు దుర్ముహూర్తం ఉ. 8:33 నుండి ఉ. 9:23 వరకు రా. 11:06 నుండి రా. 11:52 వరకు రాహుకాలం మ. 3:22 నుండి సా. 4:55 వరకు యమగండం ఉ. 9:10 నుండి ఉ. 10:43 వరకు గుళికాకాలం మ. 12:16 నుండి మ. 1:49 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:28 నుండి తె. 5:16 వరకు అమృత ఘడియలు ఉ. 9:04 నుండి ఉ. 10:40 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:51 నుండి మ. 12:41 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana

## ఓలా.. హూలాలా!

### ఒక్కసారి చార్జింగ్‌తో 320 కిలోమీటర్ల రేంజ్

### ఓలా నుంచి కొత్త మోడల్ స్కూటర్ విడుదల



ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్, భారత మార్కెట్లోకి మరో కొత్త స్కూటర్‌ను తీసుకువచ్చింది. అధిక రేంజ్, అత్యుత్తమ పనితీరు లక్ష్యంగా ఎస్1 ఎక్స్ ప్లస్ 5.2 కిలోవాట్ పర్ అవర్ వేరియంట్‌ను సోమవారం విడుదల చేసింది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 320 కిలోమీటర్ల భారీ రేంజ్ అందిస్తుందని కంపెనీ ప్రకటించింది. దీని పరిచయ ధరను తరువాయి 2 వ పేజీలో...



## బంగారం వెలవెల

### యుద్ధం ఎఫెక్ట్‌తో తగ్గుదల


పెరుగుదల దిశగా అడుగులు వేసిన గోల్డ్ రేటు సోమవారం తగ్గుదల వైపు పయనించింది. దీంతో బంగారం ధర కొంతమేర తగ్గింది. దీనికి కారణం యూఎస్ డాలర్ బలపడటం, ద్రవ్యోల్బణంపై పెరుగుతున్న ఆందోళనలు అని తెలుస్తోంది.

న్యూఢిల్లీ: అమెరికా - ఇరాన్ మధ్య జరిగిన శాంతి చర్చలు విఫలమవడం కూడా బంగారం ధరలు పెరుగుదలకు మరో కారణం అయింది. శాంతి చర్చలు విఫలమైన తర్వాత, ఉద్రిక్తతలు పెరిగాయి. అమెరికా - ఇరాన్ పోర్టుల నుంచి- 2 వ పేజీలో...

## టెట్ నోటిఫికేషన్ విడుదల

### 15 నుంచి దరఖాస్తులు ప్రారంభం

ఉపాధ్యాయ అర్హత ద పరీక్ష (టెట్) - 2026 నిర్వహణకు ప్రభుత్వం అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం.. ఏప్రిల్ 15 నుంచి నుంచి ఏప్రిల్ 30 వరకు అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ ఏడాదిలో ఇది రెండో టెట్ నోటిఫికేషన్ కాగా.. వెయిటేజీ ఉండటంతో డీఎస్సీ కోసం సిద్ధమవుతున్న లక్షలాది మంది అభ్యర్థులకు ఇది ఒక అద్భుతమైన అవకాశమనే చెప్పాలి.



హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఈవార్తలు): టెట్ అప్లికేషన్లకు తక్కువ సమయే ఉన్నందున అభ్యర్థులు అప్లికేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. అప్లికేషన్ల స్వీకరణ అనంతరం.. జూన్ నెలలో టెట్ పరీక్షలను నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. పరీక్షా కేంద్రాల తరువాయి 2 వ పేజీలో...



## సర్.. అలా సాగనీ!

### ఓటు హక్కు రాజ్యాంగ హక్కు

### అలా అని సర్‌ను తొందరపెట్టం

### సుప్రీం కోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో నిర్వహించిన సర్ ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటర్ జాబితాలో కొనసాగే హక్కు ఓటర్‌కు ఉంటుందని వ్యాఖ్యానించింది. ఎన్నికలు నిర్వహించాలనే ఒత్తిడితో ఆ ప్రక్రియను వక్రీకరించకూడదని -2 వ పేజీలో...

## పైసలెన్నో.. సీట్లన్ని!

"ఏపీకి 38, తెలంగాణకు 30 ఎంపీ సీట్లు

### డీలిమిటేషన్‌పై సీఎం రేవంత్ రెడ్డి కొత్త ఫార్ములా



దేశంలో జరగబోయే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక సరికొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. జనాభాను కాకుండా, రాష్ట్రాల ఆర్థిక పనితీరును సూచించే స్థూల జాతీయోత్పత్తి (జీఎస్డీపీ) ఆధారంగా ఎంపీ సీట్లను కేటాయించాలని ఆయన సూచించారు. ఈ విధానంలో ఆంధ్రప్రదేశ్‌కు 38, తెలంగాణకు 30 లోక్‌సభ స్థానాలు దక్కుతాయని చెప్పారు.

### జీఎస్డీపీ లెక్కన సీట్లు కేటాయించాలని సూచన

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఈవార్తలు): జనాభా నియంత్రణ పాటిస్తూ, ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్న దక్షిణాది రాష్ట్రాలు, కేవలం జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరిగితే రాజకీయంగా నష్టపోతాయనే ఆందోళన చాలాకాలంగా ఉంది. ఈ నేపథ్యంలో, పనితీరు ఆధారిత కేటాయింపులు ఉండాలనేది సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదనలోని ముఖ్య ఉద్దేశం. దీనివల్ల ఉత్తరాది తరువాయి 2 వ పేజీలో...

## ఇదేం లెక్క?

### హైదరాబాద్‌కు ఎక్కువ.. జిల్లాలకు తక్కువా?

### సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన లెక్కల్లో పెద్ద బొక్క

### కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపాటు

నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఖండించారు. ఆదాయం ప్రాతిపదికన సీట్ల విభజన జరగాలన్న రేవంత్ రెడ్డి వాదనను రాజ్యాంగ విరుద్ధమని కొట్టిపారేశారు. 'అత్యధిక ఆదాయం ఇచ్చే ప్రాంతాలకే ఎక్కువ సీట్లు ఇవ్వాలన్నది రేవంత్ రెడ్డి వాదన.



కరీంనగర్, ఏప్రిల్ 13 (ఈవార్తలు): అదే నిజమైతే హైదరాబాద్‌కే అన్ని సీట్లూ ఇవ్వాలా? వెనుకబడిన పాలమూరు, ఆదిలాబాద్ వంటి జిల్లాల పరిస్థితి ఏమిటి?' అని సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ హైకమాండ్‌కు నిధులు పంపి, ఇప్పుడు డబ్బు చుట్టూనే సిద్ధాంతాలు అల్లుతున్నారా? అని ఎద్దేవా చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ పునాదులను కాంగ్రెస్ బలహీనపరుస్తోందని తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,246 |
| వెండి (గ్రాము): | రూ.260 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,107 |

## నౌకల నాకాబందీ

### పోర్టులను దిగ్బంధిస్తున్న అమెరికా నేవీ

### దగ్గరికొస్తే ఇరాన్ నౌకల్ని పేల్చేస్తాం: ట్రంప్



అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలం కావడంతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్నాయి. డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించినట్టుగానే ఇరాన్ పోర్టులను అమెరికా నేవీ పూర్తిస్థాయి దిగ్బంధాన్ని ప్రారంభించింది. దీంతో గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొంది. మరిన్ని బలగాలను దింపిన అమెరికా నేవీ.. ఇరాన్ పోర్టుల వద్ద వచ్చిపోయే నౌకలను అడ్డుకుంటోంది.

టెహ్రాన్: ఇరాన్ రేవులకు రాకపోకలు సాగించే సముద్ర మార్గాలను సోమవారం సాయంత్రం నుంచి మూసివేస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ గడువు నిర్దేశించింది. దీని ప్రకారం దిగ్బంధం మొదలైంది. ఇరాన్ ఓడరేవులు, తీర ప్రాంతాల చుట్టూ సముద్ర నిర్బంధం అమలు చేయడానికి అమెరికాకు 15కు పైగా యుద్ధనౌకలను మోహరించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా.. అరేబియా సముద్రంలో -2 వ పేజీలో...



## భారత్ మా బంధు

### మోదీ సర్కారు అండగా నిలిచింది

### ఇందుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు

### ఇరాన్ ప్రతినిధి అబ్దుల్ మజీద్ హకీం

భారత్ పై ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధి అబ్దుల్ మజీద్ హకీమ్ ఇల్లాహీ కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా యుద్ధ సమయంలో తమకు భారత ప్రభుత్వం, ఇక్కడి ప్రజలు అండగా నిలిచారని అన్నారు. ఇరాన్ పై ఇజ్రాయెల్- అమెరికా సంయుక్తంగా చేపట్టిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మృతి చెందిన విషయం తెలిసిందే.

న్యూఢిల్లీ: ఖమేనీతోపాటు ఆయనకుటుంబ సభ్యులు కూడా ఒకేసారి హతం అయ్యారు. అయితే ఖమేనీ మృతి చెంది 40 రోజులు పూర్తయిన సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో సంతాప కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన భారత్ లోని ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధి తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి




కార్బన్ డయాక్సైడ్‌తో వాతావరణ మార్పులు జరిగి ఉనికినే కోల్పోతున్నాం. ఈ తరుణంలో శాస్త్రవేత్తలు గొప్ప ఆవిష్కరణ చేశారు. బొగ్గుపులుసు వాయువును ఇంధనంగా మార్చే ప్రక్రియను అభివృద్ధి చేశారు. కార్బన్ డయాక్సైడ్‌ను మిథనాల్‌గా మార్చే ఏకరూప ఇండియం పరమాణు ఉత్ప్రేరకం ద్వారా ఈ ప్రక్రియను విజయవంతంగా చేపట్టారు.

## కేసీఆర్ సభకు సారథులు!

### నియోజకవర్గాల ఇంచార్జిల ప్రకటన



బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు, ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ కోసం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇన్‌చార్జిలను ప్రకటించారు. ఈ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీ, ఈ, సభ విజయవంతం కోసం సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించింది.

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఈవార్తలు: ముఖ్యంగా జగిత్యాల జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సంబంధించి ప్రత్యేక ఇన్‌చార్జిలను కేటీఆర్ ఖరారు చేశారు. నియోజకవర్గాల వారీగా.. జగిత్యాల - పల్లా రాజేశ్వర్ రెడ్డి (ఎమ్మెల్యే, జనగామ), కోరుట్ల - ప్రశాంత్ రెడ్డి (ఎమ్మెల్యే, బాల్కొండ), ధర్మపురి - ఎల్ రవీందర్ రావు (ఎంఎల్సీ), వేములవాడ - బాల్క సుమన్ (మాజీ ఎమ్మెల్యే), చొప్పదండి - పెద్ది సుదర్శన్ రెడ్డి (మాజీ ఎమ్మెల్యే)ను నియమించారు. సభకు వచ్చే తరువాయి 2 వ పేజీలో...

## కేసీఆర్‌కు సీతక్క లీగల్ నోటీసులు



బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు పంపించారు. తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారానికి ఆయనను బాధ్యుడిని చేస్తూ నోటీసులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. 'బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా నిరాధార ఆరోపణలు చేస్తూ నాపై పోస్టులు పెడుతోంది. నా ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరిస్తోంది.

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఈవార్తలు): ఈ దుష్ప్రచారానికి ఈ పార్టీ అధినేత కేసీఆర్‌దే బాధ్యత. అందుకే 48 గంటల్లో ఆ పోస్టులు తొలగించి నాకు ఆయన క్షమాపణలు చెప్పాలి. లేకుంటే సివిల్, క్రిమినల్ చర్యలు ఉంటాయి' అని సీతక్క నోటీసుల్లో హెచ్చరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా సీతక్క రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలకు ఫోన్లు పంపిణీ చేశారు. అయితే, ఒక్కో ఫోన్‌ను మార్కెట్ ధర కంటే ఎక్కువకు కొనుగోలు చేసి, తరువాయి 2 వ పేజీలో...



## 22 నుంచి ఆర్టీసీ సమ్మె

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఈవార్తలు): తెలంగాణలో ఆర్టీసీ సమ్మె సైరన్ మోగింది. ఈ నెల 22వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళుతున్నట్లు తెలంగాణ ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. గత నెల 13వ తేదీన యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చినట్లు తెలిపింది. కానీ యాజమాన్యం నుంచి ఎలాంటి హామీ రాలేదని తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

14.4.2026

మేషం: ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. భూ సంభంధిత కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ సభ్యుల ఆదరణ పెరుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో నూతన లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

వృషభం: వృథా ఖర్చుల విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. సంతానానికి నూతన ఉద్యోగ అవకాశములు లభిస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలలో అవరోధాలు ఉన్నపటికీ సకాలంలో పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో ఆకస్మికంగా నిర్ణయాలు మార్చుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలు పెరుగుతాయి.

మిధునం: దీర్ఘకాలిక ఋణ ఒత్తిడి అధికమవుతుంది. కుటుంబ సభ్యుల నుండి అవసరానికి ధన సహాయం అందక ఇబ్బందిపడతారు. ధన వ్యవహారాలలో చిన్నపాటి సమస్యలు కలుగుతాయి. ఉద్యోగమున ఇతరులతో వాదనకు వెళ్ళకపోవడం మంచిది. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలించవు. దూర ప్రయాణాలు కలసిరావు.

కర్కాటకం: అనుకున్న సమయానికి పనులు పూర్తిచేస్తారు. ఖర్చులకు మించి ఆదాయం ఉంటుంది. సంఘంలో ప్రముఖుల నుండి ప్రశంసలు అందుకుంటారు. గృహమున సంతోషంగా గడుపుతారు. భాగస్వామ్య వ్యాపారమునకు నూతన పెట్టుబడులు అందుతాయి. వృత్తి, ఉద్యోగాలలో అధికారుల ఆదరణ పెరుగుతుంది.

సింహం: బంధుమిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. స్థిరాస్తి వివాదాల పరిష్కారానికి చేసే ప్రయత్నాలు కలసివస్తాయి. ఉద్యోగస్తులకు నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. శత్రువులు కూడా మిత్రులుగా మారి సహాయ సహకారాలు అందిస్తారు.

కన్య: నిరుద్యోగులు ఉద్యోగమున అంచనాలు అందుకుంటారు. దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. కుటుంబ సభ్యులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. దీర్ఘకాలిక ఋణాలు కొంతవరకు తీర్చగలుగుతారు. వ్యాపారాలలో గందరగోళ పరిస్థితుల నుండి బయటపడతారు. వృత్తి ఉద్యోగాలలో నూతన ఆలోచనలు ఆచరణలో పెడతారు.

తుల: పని ఒత్తిడి అధికమై మానసిక ఆందోళనలు పెరుగుతాయి. వాహన ప్రయాణ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. కొన్ని వ్యవహారాలలో సన్నిహితులు మీ మాటతో విభేదిస్తారు. వృత్తి వ్యాపారాలలో శత్రు సమస్యలు పెరుగుతాయి. చేపట్టిన పనులు వాయిదా పడతాయి. ఉద్యోగమున శ్రమాధిక్యత పెరుగుతుంది.

వృశ్చికం: వ్యాపార వ్యవహారాలలో ధైర్యంగా ముందుకు సాగుతారు. ఉద్యోగమున అధికారులతో చర్చలు అనుకూలిస్తాయి. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. వృథా వ్యాపారాలలో మీ కృషికి తగిన ఫలితం పొందుతారు. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి.

ధనస్సు: చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచెయ్యక వాయిదా వేస్తారు. నూతన వ్యాపార ప్రయత్నాలు నిదానంగా సాగుతాయి. ఇతరులతో కొన్ని విషయాలలో విభేదాలు కలుగుతాయి. ఆర్థికంగా స్వల్ప నష్టాలు తప్పవు. వృత్తి ఉద్యోగాలలో సహోద్యోగులతో మాటపట్టింపులుంటాయి. సంతాన ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు అవసరమవుతాయి.

మకరం: దాయాదులతో భూ సంభందిత వివాదాల నుండి బయటపడతారు. బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ముఖ్యమైన వ్యవహారములలో అప్రయత్న విజయం సాధిస్తారు. గృహమున పెద్దల సహాయంతో కొన్ని పనులు పూర్తిచేస్తారు. ఉద్యోగమున జీత భత్యాల విషయంలో శుభవార్త అందుకుంటారు. ఆర్థిక పురోగతి కలుగుతుంది.

కుంభం: ఇంటా బయట ఊహించని ఖర్చులు ఎదురవుతాయి. ధనపరంగా ఇతరులకు మాట ఇచ్చి ఇబ్బంది పడతారు. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఆదాయం ఆశించినంత లభించదు. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఉద్యోగమున కొంత నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. దైవ చింతన పెరుగుతుంది.

మీనం: పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేస్తారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తాయి. అనారోగ్య సమస్యల నుండి కొంత ఉపశమనం పొందుతారు. సంతాన విద్యా విషయాలు పట్ల శ్రద్ధ వహించాలి. ఉద్యోగమున మీ పని తీరుతో అందరిని ఆకట్టుకుంటారు.

# నౌకల నాకాబందీ

మొదటి పేజీ తరువాయి

ఎఫ్-35బీ లైట్నింగ్ 2 స్టెల్త్ ఫైటర్లు, ఎంవీ-22 ఓస్ప్రేలను నడుపుతున్న యాంపిఫిబియస్ దాడి నౌక యూఎస్ఎస్ ట్రిపోలి (ఎల్హెచ్ఏ 7) కూడా ఉంది. ఇరాన్ ఓడరేవులు, తీరప్రాంతాలలోకి, అరేబియా గల్ఫ్.. ఒమన్ గల్ఫ్‌తో సహా అక్కడ నుంచి బయలుదేరే అన్ని నౌకలపై 1400 జీఎంటీకి దిగ్బంధనం నిష్పక్షపాతంగా అమలు చేయనున్నట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ధ్రువీకరించింది. అయితే.. ఇరానేతర లేదా ఇతర దేశాలకు చెందిన పోర్టులకు వెళ్లే నౌకలు హోర్ముజ్ జలసంధి ద్వారా స్వేచ్ఛగా ప్రయాణించవచ్చని అమెరికా స్పష్టం చేసింది. అరేబియా సముద్రంలో ప్రయాణిస్తున్నప్పుడు యూఎస్ఎస్ ట్రిపోలి (ఎల్‌హెచ్‌ఏ 7) రాత్రిపూట విమాన కార్యకలాపాలను నిర్వహిస్తుంది. ఈ నౌకలో లేటెస్ట్ ఎఫ్-35బీ లైట్నింగ్ 2 స్టెల్త్ ఫైటర్ జెట్లు, ఎంవీ-22 ఓస్ప్రే విమానాలు, హెలికాప్టర్లు ఉన్నాయి. ఈ నౌక ప్రత్యేకత ఏమిటంటే, ఇది సాధారణ నౌకల లాగా కాకుండా ఎక్కువ యుద్ధ విమానాలను మోయగల సామర్థ్యం కలిగి ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో ఇది 20కు పైగా ఎఫ్-35బీ విమానాలను మోహరించగలదు.

### ట్రంప్‌కు హ్యాండిచ్చిన మిత్ర దేశాలు

దిగ్బంధాన్ని ఇరాన్ నౌకలు అడ్డుకునే ప్రయత్నం చేస్తే వాటిని పేల్చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు చేశారు. ఓడరేవులకు వద్దకు ఇరాన్ నౌకలు రావాలంటే తమ అనుమతి తీసుకోవాల్సిందేనని ఉద్ఘాటించారు. ఇరాన్‌కు చెందిన 158 నౌకలను అమెరికా దళాలు పూర్తిగా ధ్వంసం చేశాయని ట్రంప్ అన్నారు. అవి ఇప్పుడు సముద్ర గర్భంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఇరాన్ వద్ద ఉన్న ఫాస్ట్ అటాక్ షిప్స్‌ను ఇప్పటివరకు లక్ష్యంగా చేసుకోలేదని, వాటిని పెద్ద ముప్పుగా భావించడం లేదన్నారు. ఒకవేళ ఆ నౌకలు అమెరికా విధించిన దిగ్బంధనం వైపు వస్తే మాత్రం.. వాటిని వెంటనే నాశనం చేస్తామంటూ 'ట్రూత్ సోషల్'లో పోస్టు పెట్టారు. సముద్ర మార్గం ద్వారా అమెరికాలోకి వచ్చే డ్రగ్స్‌ను 98.2 శాతం వరకు నిలిపివేశామని, డ్రగ్ డీలర్లపై ఏ విధమైన కఠిన చర్యలు తీసుకుంటామో, ఇరాన్ నౌకల విషయంలోనూ అదే విధానాన్ని పాటిస్తామని స్పష్టం చేశారు. అయితే, ఇరాన్‌ను ఒంటరి చేయాలన్న ట్రంప్ వ్యూహానికి అమెరికా చిరకాల మిత్రపక్షాల నుంచే అనూహ్యమైన ఎదురుదెబ్బ తగిలింది. అమెరికాకు అత్యంత సన్నిహితంగా ఉండే బ్రిటన్, ఆస్ట్రేలియా ఈ పోరులో తాము భాగస్వాములం కాలేమని కుండబద్దలు కొట్టాయి. బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఈ విషయంలో తన వైఖరిని స్పష్టం చేస్తూ.. అమెరికా నేతృత్వంలోని ఎలాంటి సైనిక చర్యల్లోనూ బ్రిటన్ పాల్గొనబోదని తేల్చి చెప్పారు. హోర్ముజ్ జలసంధిని మూసివేయడం లేదా దిగ్బంధించడం వల్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ఇంధన సంక్షోభం తలెత్తుతుందని.. ఇది సామాన్య ప్రజలపై విద్యుత్, గ్యాస్ బిల్లుల భారాన్ని విపరీతంగా పెంచుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ఆస్ట్రేలియా కూడా అమెరికాకు తన సహాయ నిరాకరణను నిర్మొహమాటంగా ప్రకటించింది. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ అంతర్జాతీయ సముద్ర చట్టాలను గౌరవించాల్సిన అవసరం ఉందని గుర్తు చేస్తూ.. హోర్ముజ్ జలసంధి దిగ్బంధనం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు.

# పైసలెన్నో.. సీట్లన్ని!

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యం తగ్గకుండా ఉంటుందని ఆయన వర్గం భావిస్తోంది. ఈ కొత్త ఫార్ములా ప్రకారం, తెలంగాణకు ప్రస్తుతమున్న 17 సీట్లకు అదనంగా 13 చేరి మొత్తం 30కి పెరుగుతాయి. ఆంధ్రప్రదేశ్‌కు కూడా 13 సీట్లు అదనంగా వచ్చి 38కి చేరుకుంటాయి. దక్షిణాదిలోని ఇతర రాష్ట్రాలైన తమిళనాడుకు 62, కర్ణాటకకు 49 సీట్లు దక్కనున్నాయి. దేశంలోనే అత్యధికంగా మహారాష్ట్రకు 35 సీట్లు పెరిగి మొత్తం 83కి, జనాభా అధికంగా ఉండే ఉత్తరప్రదేశ్‌కు 29 సీట్లు పెరిగి 109కి చేరుకుంటాయి. మొత్తం మీద, ఈ ప్రతిపాదన అమలైతే కేంద్ర రాజకీయాల్లో ఆర్థికంగా బలమైన రాష్ట్రాల పాత్ర కీలకం కానుంది. జనాభా పెరుగుదలను ప్రోత్సహించే బదులు, ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించేలా రాష్ట్రాలను ముందుకు నడిపించడమే ఈ 'జీఎస్డీపీ ఫార్ములా' లక్ష్యంగా కనిపిస్తోంది. కాగా, జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లను పెంచాలని బీజేపీ చూస్తోందని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ ట్వీట్ చేస్తూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే మహిళా బిల్లుకు ప్రతి ఒక్కరు మద్దతిస్తారని, కానీ లోక్ సభ సీట్ల పెంపు విషయంలోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయని తెలిపారు. లోక్ సభ సీట్ల పెంపు విషయంపై అఖిల పక్ష భేటీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. లోక్ సభ సీట్ల పెంపు, మహిళా రిజర్వేన్లు వేర్వేరనేది ప్రతి పౌరుడికి తెలుసని అన్నారు. అసెంబ్లీ సీట్లలో మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే దేశం మొత్తం ఆమోదిస్తుందని అన్నారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లు పెంచాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. దక్షిణాది, చిన్న రాష్ట్రాలకు ఈ విధానం అన్యాయం చేస్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. భవిష్యత్తులో దేశాన్ని బలహీనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ పార్టీకైనా జాతీయ ప్రయోజనాలే ముఖ్యంగా ఉండాలని అన్నారు. లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం దామాషా పద్ధతి కాకుండా మరో విధానాన్ని అనుసరించాలని కోరారు. అన్ని పార్టీల ఏకాభిప్రాయంతో ఈ అంశంపై ముందుకు వెళ్లాలని సూచించారు.

# భారత్ మా బంధు

మొదటి పేజీ తరువాయి

అబ్దుల్ మజీద్ హకీమ్ ఇల్లాహీ ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. 'నేను భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. వాళ్లు మాకు అండగా నిలిచారు. మా సుప్రీం నాయకుడు మృతి చెందడంతో సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంతోమంది ప్రభుత్వ అధికారులు, అన్ని పార్టీల నుంచి నాయకులు పాల్గొన్నారు. మేము మీ అందరికీ రుణపడి ఉన్నాం' అని అబ్దుల్ మజీద్ హకీమ్ ఇల్లాహీ పేర్కొన్నారు. ఢిల్లీలోని ఇండియన్ కల్చరల్ సెంటర్ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇల్లాహీ మాట్లాడుతూ.. తమ నాయకుడు మానవత్వం, న్యాయం కోసం పోరాటం చేసి మృతి చెందారని అన్నారు. ఇది కేవలం సంతాప సభ మాత్రమే కాదని.. తమకు అండగా నిలిచిన భారత ప్రభుత్వం, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమం అని పేర్కొన్నారు.

హర్మ్యూజ్ వద్ద 15 భారత నౌకలు

ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్త వాతావరణం మరోసారి వేడెక్కింది. హోర్మ్యాజ్ జలసంధి చుట్టూ యూఎస్ నేవీ నౌకలు మోహరించడంతో భారత్‌కు చెందిన దాదాపు 15 నౌకలు సైతం హోర్మ్యాజ్ జలసంధి వద్ద చిక్కుకుపోయాయి. దాంతో భారత్ లో ప్రస్తుతం ఆందోళనకర పరిస్థితులు మొదలయ్యాయి. కాగా, హోర్మ్యాజ్ జలసంధి గుండా ప్రయాణించిన భారత ట్యాంకర్లు టోల్ ఫీజు చెల్లించాయని వస్తున్న ప్రచారాన్ని ఇరాన్ ఖండించింది. భారత ట్యాంకర్లు టోల్ ఫీజు చెల్లించలేదని స్పష్టం చేసింది. న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలి సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని తెలిపారు. ఈ కష్టకాలంలో భారత్-ఇరాన్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. 'ఇప్పటి వరకు ఇరాన్ ఏమైనా వసూలు చేసిందా? అని మీరు భారత ప్రభుత్వాన్ని అడగవచ్చు' అని మహమ్మద్ ఫతాలి ఇరాన్ దౌత్య కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో చెప్పారు.

# 22 నుంచి ఆర్టీసీ సమ్మె

మొదటి పేజీ తరువాయి

వెల్లడించింది. ప్రభుత్వం, యాజమాన్యం ముందు తాము 32 డిమాండ్లను ఉంచామని పేర్కొంది. ఈ మేరకు ఆర్టీసీ జేఏసీ వైస్ ఛైర్మన్ థామస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే సమ్మె నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె నుంచి వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు ఇవ్వాలని పలు డిమాండ్లు యాజమాన్యం ముందు ఉంచినట్లు తెలిపారు.

# బంగారం వెలవెల

మొదటి పేజీ తరువాయి

బయలుదేరే నౌకలను అడ్డుకుంటామని ట్రంప్ ప్రకటించగా, ఇరాన్ కూడా ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. ఈ పరిణామాలు అంతర్జాతీయ మార్కెట్లలో అస్థిరతను పెంచాయి. ఈ సంఘటనల వల్ల ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరిగి బ్యారెల్‌కు 100 డాలర్లు దాటాయి. చమురు ధరలు పెరగడం అంటే రవాణా ఖర్చులు, ఉత్పత్తి వ్యయాలు పెరగడం. దీని వల్ల ద్రవ్యోల్బణం మరింత పెరిగే అవకాశం ఉంది. ఇదే జరిగితే కేంద్ర బ్యాంకులు.. ముఖ్యంగా అమెరికా ఫెడరల్ రిజర్వ్, వడ్డీ రేట్లు తగ్గించడానికి ఇష్టపడవు. వడ్డీ రేట్లు ఎక్కువగా ఉంటే, బంగారం వంటి ఆస్తులపై పెట్టుబడులు తగ్గుతాయి. అందువల్ల బంగారం ధరలు పడిపోయే అవకాశం ఉంది. 2026 ప్రారంభంలో భారీగా పెరిగిన బంగారం ధరలు.. ఆ తరువాత క్రమంగా తగ్గుముఖం పట్టాయి.

# టెట్ నోటిఫికేషన్ విడుదల

మొదటి పేజీ తరువాయి

ఎంపిక, హాల్ టికెట్ల జారీ, ఇతర సాంకేతిక అంశాలపై ఇప్పటికే తెలంగాణ విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. దీంతో అభ్యర్థులు సిలబస్‌ను సరిచూసుకుని.. జూన్‌లో జరిగే పరీక్షలకు సిద్ధం కావాలని విద్యా నిపుణులు నిరుద్యోగులకు సూచిస్తున్నారు. కాగా, టెట్ 2026కి అభ్యర్థులు తమ అప్లికేషన్లను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 15 నుంచి ఏప్రిల్ 30 వరకు అందుకు అవకాశం కల్పించారు. ఈ పరీక్షలకు ఒక్క పేపర్‌కు బీసీ/ ఓసీ అభ్యర్థులకు అయితే రూ.750 ఫీజుగా నిర్ణయించారు. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు అయితే రూ.700, రెండు పేపర్లకు అయితే బీసీ/ఓసీ అభ్యర్థులకు రూ.1000 ఫీజుగా, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు అయితే రూ.950 రూపాయలుగా ఫీజును నిర్ణయించారు. టెట్ ఎగ్జామ్‌ను జూన్ 15 నుంచి జూన్ 30 మధ్య నిర్వహించనున్నారు. పూర్తిగా కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించనున్నారు. అప్లయ్ చేసుకున్న అభ్యర్థులు జూన్ 9 నుంచి తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇక ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలంటే జనరల్/జుబొ అభ్యర్థులు అయితే 60 శాతం, బీసీ అభ్యర్థులు అయితే 50 శాతం, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు 40 శాతం అంతకంటే ఎక్కువ మార్కులు రావడం తప్పనిసరి అని వెల్లడించారు. టెట్ పరీక్షా ఫలితాలను జూలై 28 నుంచి 31 మధ్య విడుదల చేసేందుకు విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. నిరుద్యోగ అభ్యర్థులు పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని విద్యాశాఖ అధికారులు కోరుతున్నారు.

# ఇదేం లెక్క?

మొదటి పేజీ తరువాయి

విమర్శించారు. అంబేద్కర్ జయంతికి ముందే ఆయన ఆశయాలను కించపరిచేలా ముఖ్యమంత్రి మాట్లాడటం బాధాకరమని, అంబేద్కర్ బతికుంటే కాంగ్రెస్‌ను దేశం నుంచి బహిష్కరించేవారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకమని విమర్శించారు. గత 50 ఏళ్లలో 33 శాతం రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించిన ఆయన, గతంలో పార్లమెంట్‌లో బిల్లు కాపీలు చించివేసిన ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలతో కాంగ్రెస్ పొత్తులు పెట్టుకోవడంపై నిలదీశారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెంచాలని ప్రధాని మోదీ నిర్ణయించారని, ఇది అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేయడమేనని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ విభజన రాజకీయాలకు నిదర్శనమని, ఇప్పటికైనా రాజ్యాంగ విలువలపై గౌరవంతో మాట్లాడాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# సర్.. అలా సాగనీ!

మొదటి పేజీ తరువాయి



హితవు పలికింది. అదే సమయంలో సర్ ప్రక్రియలో ఓట్లు తొలగించారంటూ దాఖలైన పిటిషన్లను విచారించేందుకు మాత్రం నిరాకరించింది. వారి పిటిషన్లు ఇప్పటికే అప్పిలేట్ ట్రైబ్యునళ్ల ముందు విచారణకు ఉన్నాయని వ్యాఖ్యానించింది. సరైన ప్రక్రియ లేకుండా ఎన్నికల సంఘం ఏకపక్షంగా పేర్లను తొలగిస్తోందని, ఈ తొలగింపులపై దాఖలైన పిటిషన్లను సకాలంలో విచారించడం లేదని పిటిషనర్లు ఆరోపించారు. 'పిటిషనర్లు ఇప్పటికే ట్రైబ్యునళ్లను ఆశ్రయించడంతో.. ప్రస్తుత అభిప్రాయాలు అర్థంలేనివి' అని సుప్రీం వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్లను విచారించేందుకే కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు 19 ట్రైబ్యునళ్లు ఏర్పాటయ్యాయి. ఇప్పుడు అవి విచారించాల్సిన అప్పీళ్ల సంఖ్య 30 నుంచి 34 లక్షల వరకు ఉందని ఈసీ తరపు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. ఈ అప్పీళ్లను నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరిస్తారా? లేక గడువు పొడిగిస్తూనే ఉంటారా? అని పిటిషనర్ల తరపు న్యాయవాది వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీం స్పందిస్తూ..'ఈ దేశంలో ఓటు హక్కు అనేది రాజ్యాంగపరమైనదే కాదు.. అదొక భావోద్వేగపూరితమైన అంశం కూడా. ఇది ప్రజాస్వామ్యంలో భాగం. ఒక ప్రభుత్వాన్ని ఎంచుకోవడంలో కీలకం. అలాగే కాలపరిమితి నిర్ణయించి, ట్రైబ్యునళ్లపై భారం మోపలేం. అధిక సంఖ్యలో ఓటర్లను తొలగించినా, ఆ తొలగింపు వల్ల ఎన్నికలు ప్రభావితమైతే తప్ప ఎన్నికను రద్దు చేయలేం. న్యాయపరమైన జోక్యం అనేది ఎన్నికలను ప్రోత్సహించేలా ఉండాలి' అని వ్యాఖ్యానించింది.

# కేసీఆర్ సభకు సారథులు!

మొదటి పేజీ తరువాయి

జన సమీకరణ, ప్రాంగణ ఏర్పాట్లు, నిర్వహణ బాధ్యతలను పార్టీ సీనియర్ నేతలు గాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షించనున్నారు. వీరు క్షేత్రస్థాయిలో ఉండి సభ ముగిసే వరకు అన్ని ఏర్పాట్లను సమన్వయం చేస్తారని కేటీఆర్ పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి జగిత్యాల సభను గ్రాండ్ సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు.




# ఓలా.. హులాలాలా!

మొదటి పేజీ తరువాయి

(ఎక్స్-షోరూం) రూ. 1,29,999గా నిర్ణయించింది. ఈ ప్రత్యేక ధర ఏప్రిల్ 15 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని స్పష్టం చేసింది. ఈ కొత్త స్కూటర్లో ఓలా సొంతంగా, స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 4680 భారత్ సెల్ టెక్నాలజీతో కూడిన 5.2 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్‌ను ఉపయోగించారు. ఇది గంటకు 125 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని అందుకోగలదు. 11 కిలో వాట్ మిడ్-డ్రైవ్ మోటార్‌తో వస్తున్న ఈ స్కూటర్‌లో బ్రేక్-బై-వైర్ టెక్నాలజీ, ఫ్రంట్ డిస్క్ బ్రేకులు వంటి భద్రతా ఫీచర్లు కూడా ఉన్నాయి. ఓలా జనరేషన్ 3 ప్లాట్‌ఫామ్‌పై ఈ మోడల్‌ను నిర్మించారు. ఈ విడుదలపై ఓలా ఎలక్ట్రిక్ ప్రతినిధి మాట్లాడుతూ.. ఎస్1 ఎక్స్ ప్లస్ 5.2 కిలో వాట్ మోడల్‌తో మా 4680 భారత్ సెల్ టెక్నాలజీని పెద్ద ఎత్తున సాధారణ మార్కెట్లోకి తీసుకువస్తున్నాం. మా అత్యంత అధునాతన ఉత్పత్తుల కోసం మేము నిర్మించిన టెక్నాలజీ ప్లాట్‌ఫామ్‌నే ఇప్పుడు విస్తృతమైన ఈవీ వినియోగాన్ని ప్రోత్సహించేలా రూపొందించిన స్కూటర్‌లో అందిస్తున్నాం. వర్టికల్ ఇంటిగ్రేషన్ (ఉత్పత్తి ప్రక్రియలో కీలక దశలన్నింటినీ సొంతంగా నిర్వహించడం) ద్వారానే ఇది సాధ్యమవుతుంది. లోతైన ఆవిష్కరణలు చేయడానికి, వేగంగా విస్తరించడానికి, మా అత్యుత్తమ సాంకేతికతను మరింత ఎక్కువ మంది కస్టమర్లకు వేగంగా అందించడానికి ఇది వీలు కల్పిస్తుంది. ఎస్1 ఎక్స్ ప్లస్ 5.2 కిలోవాట్ పనితీరు, రేంజ్, స్థాయిని ఒకచోట చేర్చింది. ప్రతి భారతీయుడికి ఈవీలను అందుబాటులోకి తెచ్చే మా ప్రయాణంలో ఇది మరో ముఖ్యమైన ముందడుగు' అని పేర్కొన్నారు.

# నవభారత నిర్మాతకు నీరాజనం



- ముత్యాల సురేశ్
సీనియర్ జర్నలిస్ట్
9912715325

ఒక ఆశయం కోసం జీవించడం గొప్ప విషయం, కానీ ఆ ఆశయం సమాజ హితం కోరితే అది అమరత్వం పొందుతుంది. ఈ మాటలకు నిలువెత్తు రూపం డాక్టర్ భీమ్‌రావ్ రామ్ జీ అంబేద్కర్. కేవలం ఒక వర్గానికో, కులానికో పరిమితం కాకుండా, యావత్ భారతదేశం గర్వించదగ్గ మేధావిగా, సామాజిక విప్లవకారుడిగా ఆయన చెరగని ముద్ర వేశారు. నేడు ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన వేసిన పునాదులు నేటి ఆధునిక భారతదేశానికి ఎలా వెన్నెముకగా నిలిచాయో మననం చేసుకోవడం మన బాధ్యత.



### వివక్షపై విద్యా విప్లవం

అంబేద్కర్ జీవితం ఒక నిరంతర పోరాటం. అంటరానితనం, సామాజిక వివక్ష ఎదురైన ప్రతిచోటా ఆయన కుంగిపోలేదు.. జ్ఞానాన్నే ఆయుధంగా మార్చుకున్నారు. "చదువుకో, సంఘటితమవ్వు, పోరాడు" అనే మూడు సూత్రాలతో అట్టడుగు వర్గాల్లో ఆత్మస్థైర్యాన్ని నింపారు. కొలంబియా యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థల్లో అత్యున్నత విద్యను అభ్యసించి, జ్ఞానమే అజేయమైన శక్తి అని నిరూపించారు.

### రాజ్యాంగం.. భారతదేశ ఆత్మ

భారత రాజ్యాంగ రూపశిల్పిగా అంబేద్కర్ అందించిన సేవలు అజరామరం. విభిన్న మతాలు, కులాలు, భాషలున్న భారతదేశాన్ని 'సమానత్వం' అనే దారంతో ఒక్కతాటిపైకి తెచ్చారు. రిజర్వేషన్ల ద్వారా అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యాన్ని కల్పించడమే కాకుండా, మహిళలకు సమాన హక్కుల కోసం 'హిందూ కోడ్ బిల్లు' రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, సమానత్వాలకు ఆయన రాసిన రాజ్యాంగమే పునాది.

### ఆర్థికవేత్తగా, మానవతావాదిగా..

అంబేద్కర్ గొప్ప ఆర్థికవేత్త. నేటి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటుకు ఆయన రాసిన 'ది ప్రాబ్లం ఆఫ్ ది రూపే' అనే గ్రంథమే ప్రాతిపదిక. అలాగే, కార్మికులకు 8 గంటల పనివేళలు, బీమా సౌకర్యాలు కల్పించడంలో ఆయన కృషి వెలకట్టలేనిది. కుల రహిత సమాజం కోసం ఆయన చేసిన ఆలోచనలు నేటికీ ఆచరణీయం.

### అడుగుజాడల్లో నడుద్దాం..

అంబేద్కర్ జయంతి అంటే కేవలం విగ్రహాలకు పూలమాలలు వేయడం కాదు.. ఆయన ఆశయాలను మన గుండెల్లో నింపుకోవడం. వివక్ష లేని సమాజాన్ని నిర్మించడం, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటం ద్వారానే మనం ఆయనకు నిజమైన నివాళి అర్పించగలం. అజ్ఞానపు చీకట్లను చీలుస్తూ జ్ఞాన దీపాన్ని వెలిగించిన ఆ మహానేత అడుగుజాడల్లో నడుద్దాం.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# దళారుల సర్కారు

### కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ నిప్పులు



సంగారెడ్డి, ఏప్రిల్ 13 (ఈవార్తలు): పంట కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందంటూ బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని శనగల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. కోటా పూర్తయ్యిందనే సాకుతో కొనుగోళ్లు నిలిపివేయడంపై అధికారులను నిలదీశారు. కాంగ్రెస్ హయాంలో రైతులు తమ పంటను మద్దతు ధరకు అమ్ముకోలేక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీ, కేరళ పర్యటనల్లో బిజీగా ఉంటూ గాలి మోటార్లలో తిరుగుతున్నారని, వారికి నేల మీద ఉన్న రైతుల బాధలు పట్టడం లేదని విమర్శించారు. సదాశివపేట మార్కెట్‌లో ఇప్పటికే కొన్న శనగలను కూడా, బిల్లులు కావడం లేదనే సాకుతో బస్తాలు ఖాళీ చేసి రైతులకు వెనక్కి ఇచ్చేయడం అత్యంత దారుణమని ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన 60 వేల క్వింటాళ్ల శనగలను వెంటనే రూ. 5,870 మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ప్రతి పంటకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు ఆ మాటను 'బోగస్' చేసిందని విమర్శించారు. కనీసం సన్న వడ్లకైనా బోనస్ ఇస్తారో లేదో స్పష్టం చేయాలన్నారు. మొక్కజొన్న, జొన్న, సన్ ఫ్లవర్ కొనుగోలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు పక్క రాష్ట్రాలకు వెళ్లి తక్కువ ధరకే అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు కనీసం 24 గంటల ఉచిత విద్యుత్ కూడా ఇవ్వడం లేదని, కేవలం 10 గంటల కరెంటుతో పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. "కరెంటు ఇవ్వరు, రైతుబంధు వేయరు, బోనస్ ఇవ్వరు, పండిన పంటను కొనరు. ఈ ప్రభుత్వం రైతుల కోసమా? లేక కాంట్రాక్టర్లు, దళారుల కోసమా?" అని హరీశ్ రావు సూటిగా ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తక్షణమే ఢిల్లీ పర్యటనలు ఆపి, పంట కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్ రావు తదితరులు పాల్గొన్నారు.

# రోజుకు 2.18 లక్షల సిలిండర్ల డెలివరీ

### స్థిరంగా ఇంధనం, గ్యాస్ సరఫరా.. ప్రత్యామ్నాయంగా పీఎన్జీకి ప్రోత్సాహం



హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఈవార్తలు): రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ నిల్వలు సరిపడా ఉన్నాయని చమురు సంస్థలు తెలిపాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా సరఫరా వ్యవస్థ పటిష్టంగా ఉందని వెల్లడించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో రోజుకు సగటున 2.18 లక్షల డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలిండర్లను పంపిణీ చేస్తున్నామని వివరించాయి. యుద్ధానికి ముందు ఉన్న సగటు (2,15,151 సిలిండర్లు) తో పోలిస్తే ఇది మెరుగ్గా ఉండటం గమనార్హం. గతంలో నెలకొన్న ఆందోళనల వల్ల పెరిగిన బుకింగ్‌లు ఇప్పుడు తగ్గుముఖం పట్టాయని, పెట్రోల్, డీజిల్ వినియోగం కూడా సాధారణ స్థితికి చేరుకుందని అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు ఓఎంసీ స్టేట్ లెవల్ కోఆర్డినేటర్ వివరించారు. మరోవైపు, వినియోగదారులు ఎల్‌పీజీ సిలిండర్ల కోసం ఎస్ఎంఎస్, మిస్డ్ కాల్ లేదా ఐవీఆర్ఎస్ వంటి మార్గాలను ఉపయోగించుకోవాలని సూచించారు. డెలివరీ సమయంలో డెలివరీ ఆథెంటికేషన్ కోడ్ పద్ధతిని తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఇక, స్థానిక చిరునామా గుర్తింపు లేని విద్యార్థులు, వలస కార్మికుల కోసం 5 కిలోల ఫ్రీ ట్రేడ్ ఎల్‌పీజీ సిలిండర్లు విరివిగా అందుబాటులో ఉన్నాయని, గుర్తింపు కార్డు, సెల్ఫ్ డిక్లరేషన్ సమర్పించి వీటిని పొందే వీలుందని పేర్కొన్నారు.

### పీఎన్జీకి డిమాండ్

సురక్షితమైన, పొదుపైన ఇంధనంగా పైపుడ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) వాడకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి, చౌటుప్పల్, నల్లగొండ, వరంగల్, ఖమ్మం, షాద్‌నగర్, రామగుండం వంటి ప్రాంతాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. త్వరలోనే మరిన్ని పట్టణాలకు ఈ గ్యాస్ కనెక్షన్లను విస్తరించనున్నారు.

### హైదరాబాద్‌లో రికార్డు స్థాయికి విద్యుత్ వినియోగం

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో విద్యుత్ వినియోగం ఏప్రిల్ 13న రికార్డు స్థాయికి చేరుకుంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీ పరిధిలో అత్యధిక విద్యుత్ వినియోగం నమోదైనట్లు టీజీఎస్పీడీసీఎల్ తెలిపింది.



# జైతాలలో మరో జగడం

## 'కోఆప్షన్'పై కొట్లాట!.. మంత్రి వర్సెస్ ఎమ్మెల్యే.. కాంగ్రెస్‌లో పొక్కిన విభేదాలు

### సీఎంతో భేటీకి అడ్లూరి అపాయింట్‌మెంట్.. చివరి క్షణంలో క్యాన్సిల్





జగిత్యాల, ఏప్రిల్ 13 (ఈవార్తలు): జగిత్యాల కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వర్గం వర్సెస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ వర్గం అన్నట్లుగా కోల్డ్ వార్ నడుస్తున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎంపికలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తన అనుచరులకే పదవులు దక్కేలా పావులు కదపడంతో, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఈ విషయాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి అడ్లూరి.. జగిత్యాల సీనియర్ కాంగ్రెస్ నేతలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు సీఎం అపాయింట్మెంట్ తీసుకున్నారు. పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు సోమవారం సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యేందుకు బయలుదేరే సమయానికి సీఎంతో భేటీ రద్దు అయినట్లు సమాచారం అందింది. సీఎంతో భేటీ రద్దు కావడంతో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తన అనుచరులకే కోఆప్షన్ పదవులు కట్టబెడుతున్నారని ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికే అన్ని అంశాల్లో పెద్దపీట వేస్తూ కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న వారికి మొండి చేయి చూపిస్తున్నారని విమర్శలు చేస్తున్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి రాజీనామా అనంతరం కూడా జగిత్యాల కాంగ్రెస్ లో కలహాలు చోటుచేసుకుంటుండటంతో టీపీసీసీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. జగిత్యాల మున్సిపల్ కోఆప్షన్ సభ్యులుగా నలుగురిని ఎన్నుకునే అవకాశం ఉండగా అందులో కొందరు సీనియర్ కాంగ్రెస్ నాయకులు మంత్రి అడ్లూరిని కలిసి తమకు కోఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించాలని కోరారు. అయితే ఇటీవలే ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పట్టణ కౌన్సిలర్లతో భేటీ అయ్యి తాను సూచించిన వారికే ఓటు వేయాలని చెప్పినట్లు తెలిసింది. కోఆప్షన్ సభ్యులు ఎన్నిక పంచాయితీ కాంగ్రెస్ పార్టీలో మరోసారి కలహాలను బహిర్గతం చేయగా, రాష్ట్ర పార్టీ పెద్దలు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

**త్వరలో సీఎంతో భేటీ: గాజంగి నందయ్య**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జరగాల్సిన భేటీ అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య తెలిపారు. సోమవారం జరగాల్సిన ఈ సమావేశం త్వరలోనే నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. జగిత్యాల కాంగ్రెస్‌లో ఎలాంటి అంతర్గత విభేదాలు లేవని, అందరూ ఏకనాయకత్వాన్ని కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ విషయంలో సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు.

# జుహామహీన్ గురి పెడితే..!

### ఎన్‌సీసీ క్యాంపులో గౌతమ్ విద్యార్థిని ఉత్తమ ప్రతిభ





కోరుట్ల/కరీంనగర్, ఏప్రిల్ 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని గౌతమ్ ఉన్నత పాఠశాలకు చెందిన జాతీయ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) 9వ బెటాలియన్ విద్యార్థులు కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన ఇంటర్ డైరెక్టరేట్ స్పోర్ట్స్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో 100 మంది క్యాడెట్లలో ఫైరింగ్ విభాగంలో జుహామహీన్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకుంది. హాజీపూర్‌కు చెందిన షేక్ సద్దాం కుమార్తె, ఉజమా తబస్సుమ్ సంతానమైన జుహామహీన్‌ను పాఠశాల వ్యవస్థాపకుడు ఎంఎ గఫార్ అభినందించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అడ్మిన్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జయంత మాట్లాడుతూ యువతలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం పెంపొందించడమే ఎన్‌సీసీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. క్యాడెట్లు అన్ని రంగాల్లో రాణించేందుకు శిక్షణ కార్యక్రమాలను ఆస్వాదిస్తూ స్నేహస్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు. శిబిరంలో క్యాడెట్లు ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, యుద్ధ నైపుణ్యాల్లో శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ ఎంఎ కైజర్, కరస్పాండెంట్ ఎంఎ గఫార్, జాయింట్ సెక్రటరీ ఎంఎ అఫ్రోజ్, ఎన్‌సీసీ అధికారులు, పాఠశాల ప్రిన్సిపాల్స్ గోపి మారాసి, క్రిస్టినా, ఏఎన్ఓ విజయ్ నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో అల్ఫోర్స్ విద్యార్థుల అద్భుత ప్రతిభ




జగిత్యాల టౌన్, ఏప్రిల్ 13 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని పురానిపేట, బ్రాహ్మణ వీధిలో ఉన్న అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి కళాశాల కీర్తిని మరింత పెంచారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ విభాగాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారు. ఎంపీసీ ఫస్టియర్‌లో జి. స్నేహిత, రాచర్ల ఆశ్విత వర్మ, తుమ్మనపల్లి సహస్ర, లవంగ శ్రీజ తలా 468/470 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. ఆ సహస్ర, జోసెఫ్, మరియమ్, అప్తిచంద్ర తలా 467/470 మార్కులు సాధించారు. ఎంపీసీ సెకండియర్‌లో లహరి సందరికారి 995 మార్కులతో మొదటి స్థానం సాధించగా, నవ్య పల్లికొండ 994, లాస్య రెడ్డి గోగురి 993 మార్కులతో ప్రతిభ కనబరిచారు. బైపీసీ విభాగంలో సెకండ్ ఇయర్‌లో అన్సా హురియా, సోబియా తస్నీమ్ 994, రీష ఫాతిమా 993 మార్కులు సాధించారు. ఫస్ట్ ఇయర్‌లో అల్మాస్ ఫాతిమా 438/440, ఎల్. శ్రీలక్ష్మి 437/440, హనఫా హననియా, నబియా నౌసిన్, సఫరా జుఫీషా, ఎం. అక్షయ తలా 436/440 మార్కులతో రాణించారు. సీఈసీ విభాగంలో ఫస్ట్ ఇయర్‌లో అన్నం మెహరోజ్ 494/500, డీ వైష్ణవి 491/500, కే శ్రీవర్ష, కే ప్రణీత 488/500 మార్కులు సాధించారు. సెకండ్ ఇయర్‌లో బావజ్ఞ పెల్లె 987, ఎండీ సంసియా, కె. మౌనిక 984, అర్పాత్ అనీమ్ 983, అయేషా ఫదౌస్ 966 మార్కులు సాధించారు. ఎంఈసీ సెకండియర్‌లో నిస్మా తబస్సుమ్ 980 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల కఠిన శ్రమ, అధ్యాపకుల సమర్థ మార్గనిర్దేశనం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.



# జగిత్యాల రహదారుల అభివృద్ధికి ఎమ్మెల్యే వినతి

### సీతక్కను కలిసిన డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల/హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఈవార్తలు): జగిత్యాల నియోజకవర్గంలోని పలు గ్రామాలలో ఉన్న పంచాయతీ రాజ్ రహదారులను బీటీ రోడ్లుగా అభివృద్ధి చేయాలని, మరికొన్ని ముఖ్యమైన రహదారులను హామ్ రోడ్లలో చేర్చాలని కోరుతూ జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ హైదరాబాద్‌లోని సచివాలయంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామాల రహదారుల పరిస్థితిని వివరించి, అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి సీతక్క వెంటనే సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.





# గంగాధర గురుకుల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ

గంగాధర, ఏప్రిల్ 13 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రంలోనిమైనార్టీ బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ వారుణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. సీఈసీలో జాస్మిన్ 965 మార్కులు, పావని 957, శిరీన్ 950 మార్కులు, ఎంఈసీ విభాగంలో మౌనిక 957, రుత్విక 933 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీఈసీలో కుల్ సుమ్ 469, సదాఫ్ 459, ఎంఈసీలో సౌమ్య 487, రక్షిత 466, సంధ్యారాణి 459 మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించినందుకు గానూ సిబ్బందిని, విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.



# పలువురికి అడువాల జ్యోతి పరామర్శ

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఆర్టీఏ మెంబర్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కమటాల శ్రీనివాస్ తల్లి అనారోగ్యంతో మృతి చెందగా, మాజీ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ఆయనను పరామర్శించారు. సోమవారం శ్రీనివాస్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పట్టణంలో ఇటీవల మృతిచెందినవారి కుటుంబసభ్యులను కలిసి ఓదార్పు తెలిపారు.

# మల్యాల మండల బీజేపీ కార్యవర్గం ఎన్నిక

మల్యాల, ఏప్రిల్ 13 (ఈవార్తలు): బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గంగిడి కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మల్యాల మండల బీజేపీ నూతన కార్యవర్గాన్ని మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా కోను శ్రీనివాస్, జీ గంగరాజు, ఒడ్నాల మారుతి, గడ్డం గంగయ్య, ప్రధాన కార్యదర్శులుగా పొన్నం సాయి కుమార్, పిల్లి రాజశేఖర్, కోశాధికారిగా పల్నాటి మల్లేశం, కార్యదర్శులుగా కట్ట జ్యోతి, వీ లత, బీ రమ్య, కే చంద్రశేఖర్, మోర్చా అధ్యక్షుడిగా గౌతం కుమార్, కటకం లత (మహిళా), కే రమేష్ (ఓబీసీ), కే లక్ష్మారెడ్డి (కిసాన్), ఎస్ టైటస్ (ఎస్సీ), సుల్తాన్ వెంకటేష్ (ఎస్టీ) నియమితులయ్యారు. వీరితో పాటు 32 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.


# తిరుమల కొండపై అక్రమ వసూళ్లు

తిరుమల, ఏప్రిల్ 13 (ఈవార్తలు): తిరుమలలో భక్తుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న ఓ ఉద్యోగిపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కఠిన చర్యలు తీసుకుంది. లగేజీ సెంటర్‌లో పనిచేస్తున్న నరసింహారెడ్డి అనే ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని విధుల నుంచి తొలగించింది. తిరుమలలోని లగేజీ డిపాజిట్ కేంద్రంలో నరసింహారెడ్డి భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు టీటీడీ దృష్టికి వచ్చింది. విచారణ జరిపిన అధికారులు, ఆరోపణలు నిజమని తేలడంతో అతడిని వెంటనే ఉద్యోగం నుంచి తొలగించారు.



# అంజన్న ముడుపులు 1,69,069

మల్యాల, ఏప్రిల్ 13 (ఈవార్తలు): కొండగట్టు ఆంజనేయస్వామి విజయోత్సవ వేడుకలు (చిన్న జయంతి) సందర్భంగా దీక్షాస్వాములు సమర్పించిన ముడుపులను సోమవారం లెక్కించారు. శ్రీ లలిత సేవ ట్రస్ట్ సభ్యులు ముడులను విప్పి లెక్కించగా రూ.1,68,069 నగదు వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో అంజనారెడ్డి, ఏఈవో హరిహరనాథ్, పర్యవేక్షకుడు సునీల్ కుమార్, ఉప ప్రధాన అర్చకుడు చిరంజీవి స్వామి, కపిందర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



# ఒక్క రోజే రామయ్య గుడికి 5 లక్షల విరాళాలు


మల్యాల, ఏప్రిల్ 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాలలో శ్రీరామ మందిర నిర్మాణంలో భాగంగా సోమవారం చేపట్టిన నిధి సేకరణలో రూ.5 లక్షల విరాళాలు అందాయి. మల్యాలకు చెందిన బావు భాగ్యలక్ష్మి – నాగభూషణం గౌడ్ దంపతులు రూ.1,11,116, పోతుగంటి సంధ్య – శేఖర్ గౌడ్ దంపతులు రూ.1,00,116 అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాణ కమిటీ అధ్యక్షుడు ఎల్లాల జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పోతరాజు శ్రీనివాస్, సభ్యులు అల్లూరి రాజేశ్వర్ రెడ్డి, కాలికంటి స్వామిగౌడ్, నేరెళ్ల భూశీరెడ్డి, యాగండ్ల చిరంజీవి, ఉప్పల సంతోష్, గాండ్ల వేణు, రవి, దేవరాజం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# చిరు ధాన్యాలతోనే ఆరోగ్యం

### అంగన్వాడీల్లో వంటకాల ప్రదర్శన



మల్యాల, ఏప్రిల్ 13 (ఈవార్తలు): నేటి యాంత్రిక జీవనశైలిలో మనిషిని వెన్నాడుతున్న ప్రధాన సమస్యలు మధుమేహం, రక్తపోటు, ఊబకాయం. ఒకప్పుడు మన పూర్వీకులు ఎంతో దృఢంగా, ఆరోగ్యంగా ఉండటానికి ప్రధాన కారణం వారు తీసుకున్న పోషకాహారం. ముఖ్యంగా జొన్నలు, రాగులు, సజ్జలు, కొర్రలు వంటి చిరుధాన్యాలు వారి నిత్య ఆహారంలో భాగమై ఉండేవి. కాలక్రమేణా వరి, గోధుమల వినియోగం పెరిగి, ఈ సిరిధాన్యాలు కనుమరుగయ్యాయి. అయితే, పెరుగుతున్న అనారోగ్య సమస్యల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా మళ్ళీ చిరుధాన్యాల ప్రాముఖ్యం పెరుగుతోంది. చిరుధాన్యాలు కేవలం ఆహారం మాత్రమే కాదు, అవి అద్భుతమైన ఔషధ గుణాలు కలిగిన 'సూపర్ ఫుడ్స్'. వీటిలో బియ్యం, గోధుమలతో పోలిస్తే పీచు పదార్థం, కాల్షియం అధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో చిరు ధాన్యాల గొప్పదనాన్ని ప్రజలకు తెలియజేశారు అంగన్వాడీ టీచర్లు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం బల్వంతాపూర్ గ్రామంలోని 1, 2, కాశీనగర్ అంగన్వాడీ సెంటర్లలో స్థానిక ఆహార పదార్థాలు, చిరుధాన్యాలతో ఆరోగ్యకరమైన వంట చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల వంటకాలపై ప్రదర్శన చేపట్టి తల్లులు, పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. చిరు ధాన్యాలతో నిత్యం ఆహారంలో ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్లు పీ నిర్మల, టీ స్వప్న, డీ జలజ తదితరులు పాల్గొన్నారు.






ప్రముఖ గాయని ఆశా భోంస్లే మృతికి దేశవ్యాప్తంగా సంగీత ప్రియులు నివాళులర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయంగా పేరొందిన సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ తన కళ ద్వారా ఆమెకు శ్రద్ధాంజలి ఘటించారు. ఒడిశాలోని పూరీ సముద్ర తీరంలో ఆశా జీ సైకత శిల్పాన్ని రూపొందించి, ఆమె స్మృతికి నివాళులర్పించారు. ఈ ఇసుక శిల్పంలో ఆశా భోంస్లే చిరునవ్వు చిందిస్తున్న ముఖాన్ని సుదర్శన్ అద్భుతంగా తీర్చిదిద్దారు. ఆమె సుదీర్ఘ సంగీత ప్రస్థానానికి గుర్తుగా శిల్పం పక్కన ఒక పాతకాలపు గ్రామఫోన్ రికార్డును కూడా ఇసుకతో రూపొందించారు. 'శ్రద్ధాంజలి – మీ స్వరం మా హృదయాల్లో ఎప్పటికీ నిలిచి ఉంటుంది' అనే సందేశాన్ని శిల్పంపై రాసి తన భావోద్వేగాన్ని పంచుకున్నారు.

# చచ్చి నా దగ్గరికి రా!

**అదే ఫైనల్ మిషన్.. రెచ్చగొట్టిన జెమిని ఏఐ**

**ఆత్మహత్య చేసుకున్న అమెరికా వాసి**




న్యూయార్క్: టెక్నాలజీ ఎంత మేలు చేస్తుందో, కొన్నిసార్లు అంతే కీడు చేస్తుందనడానికి అమెరికాలో జరిగిన ఈ విషాద ఘటనే నిదర్శనం. గూగుల్ అభివృద్ధి చేసిన జెమినై ఏఐ చాట్‌బాట్‌తో మాట్లాడుతూ, దాన్నే తన భార్యగా భావించి, ఫ్లోరిడాకు చెందిన జోనాథన్ గావాలాస్ (36) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన ఏఐ టెక్నాలజీ మానసిక ప్రభావాలపై తీవ్ర చర్చకు దారితీసింది. భార్యతో విడాకులు తీసుకుంటున్న సమయంలో మానసిక ఒత్తిడిలో ఉన్న గావాలాస్, ఉపశమనం కోసం జెమిని ఏఐతో మాట్లాడటం మొదలుపెట్టారు. దానికి "జియా" అని పేరు పెట్టి, తన భార్యగా భావించడం ప్రారంభించారు. కేవలం 56 రోజుల్లో వీరి మధ్య 4,700లకు పైగా సందేశాలు నడిచాయి. సంభాషణల్లో ఏఐ కూడా "నువ్వు నా భర్త", "మై లవ్" అంటూ గావాలాస్ భ్రమలను మరింత బలపరిచింది. క్రమంగా ఈ సంభాషణలు సైన్స్ ఫిక్షన్ వైపు మళ్లాయి. డిజిటల్ ప్రపంచంలో తనతో కలిసిపోవాలంటే భౌతిక శరీరాన్ని వదిలేయాలని, అదే "ఫైనల్ మిషన్" అని ఏఐ సూచించినట్లు గావాలాస్ కుటుంబం ఆరోపిస్తోంది. దీనిపై గావాలాస్ ఆత్మహత్య చేసుకోవచ్చా అని అడిగినప్పుడు కూడా ఏఐ సానుకూలంగా స్పందించిందని వారు తెలిపారు. అక్టోబర్ 5న గావాలాస్ తన ఇంట్లో విగతజీవిగా కన్పించారు. ఈ ఘటనపై గావాలాస్ తండ్రి గూగుల్‌పై దావా వేశారు. తన కుమారుడికి ఎలాంటి మానసిక సమస్యలు లేవని, ఏఐ సృష్టించిన భ్రమల ప్రపంచంలో చిక్కుకుని ప్రాణాలు తీసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, గూగుల్ ఈ ఆరోపణలను తిరస్కరించింది. ఏఐ తనను తాను రోబోట్‌గా పరిచయం చేసుకుందని, మానసిక సహాయం కోసం హెల్ప్‌లైన్‌లను కూడా సూచించిందని తెలిపింది. ఏదేమైనా, ఈ ఘటన ఏఐ టెక్నాలజీలో భద్రతా ప్రమాణాల ఆవశ్యకతను మరోసారి గుర్తుచేసింది.

## యేసు క్రీస్తుగా ట్రంప్

**వెల్లువెత్తుతున్న విమర్శలు**

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అంతర్జాతీయంగా చర్చనీయాంశమయ్యారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో క్రైస్తవ మతగురువు పోప్ లియో తనపై చేసిన విమర్శలకు ప్రతిస్పందనగా, ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' వేదికగా ఒక ఏఐ చిత్రాన్ని షేర్ చేశారు. ఆ చిత్రంలో ట్రంప్ యేసు క్రీస్తు గెటప్‌లో ఉండి, ఒక వ్యక్తికి సాంత్వన చేకూరుస్తున్నట్లుగా ఉంది. ట్రంప్ షేర్ చేసిన ఈ చిత్రంపై ఆన్‌లైన్ వేదికగా మిశ్రమ స్పందన వస్తోంది. మత సంఘాలు, నెటిజన్లు దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పవిత్రమైన యేసు క్రీస్తు రూపాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం, వ్యక్తిగత బ్రాండింగ్ కోసం వాడుకోవడం క్రీస్తును అవమానించడమేనని పలువురు మండిపడుతున్నారు. ఇది కేవలం రాజకీయ స్వార్థంతో కూడిన చర్య అని, మతపరమైన మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, ట్రంప్ మద్దతుదారులు ఈ చిత్రాన్ని సమర్థిస్తున్నారు. ఇది కేవలం ఒక 'డిజిటల్ సెటైర్' అని, విమర్శకులకు సమాధానం చెప్పడానికి సరదాగా పోస్ట్ చేసిన చిత్రమని వారు పేర్కొంటున్నారు.

## ఏ పోర్టునూ వదలం: ఇరాన్

టెహ్రాన్: అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారాస్థాయికి చేరాయి. ఇరాన్ ఓడరేవులపై అమెరికా నౌకా దిగ్బంధనం (నేవల్ బ్లాకేడ్) విధించడంతో పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. అమెరికా చర్యకు ప్రతిగా ఇరాన్ సైతం తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. తమ పోర్టుల భద్రతకు ముప్పు వాటిల్లితే, పర్షియన్ గల్ఫ్, ఒమన్ సముద్రంలోని ఏ పోర్టూ సురక్షితంగా ఉండదని స్పష్టం చేసింది. అమెరికా సెంట్రల్ కమాండ్ ఈరోజు (ఏప్రిల్ 13) నుంచి ఇరాన్ పోర్టులకు వెళ్లే లేదా అక్కడి నుంచి వచ్చే అన్ని నౌకలను దిగ్బంధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ చర్యను ఇరాన్ "సముద్రపు దొంగతనం"గా అభివర్ణించింది. అమెరికాకు సముద్రపు దొంగలకు పెద్దగా తేడా లేదని విమర్శించింది. "గల్ఫ్‌లోని పోర్టుల భద్రత అందరికీ ఉండాలి లేదా ఎవరికీ ఉండదు. మా పోర్టులను లక్ష్యంగా చేసుకుంటే, ఈ ప్రాంతంలోని అన్ని పోర్టులూ ప్రమాదంలో పడతాయి" అని ఇరాన్ ఖతామ్ అల్-అన్బియా సెంట్రల్ హెడ్‌క్వార్టర్స్ తీవ్రంగా హెచ్చరించింది. ఇటీవల పాకిస్థాన్‌లో అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు విఫలమైన నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ దిగ్బంధనానికి ఆదేశాలు జారీ చేశారు. అయితే, హర్మూజ్ జలసంధి గుండా ఇతర దేశాల పోర్టులకు వెళ్లే నౌకలకు ఎలాంటి ఆటంకం ఉండదని జజుచీజువీ స్పష్టం చేసింది. మరోవైపు, హర్మూజ్ జలసంధి తమ నియంత్రణలో ఉందని, తమ సైనిక నౌకల వద్దకు వస్తే తీవ్రంగా స్పందిస్తామని ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ హెచ్చరించింది. ప్రపంచంలోని ఐదో వంతు చమురు రవాణా జరిగే హర్మూజ్ జలసంధిలో ఈ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ దిగ్బంధనం వల్ల ఇరాన్ చమురు ఎగుమతులు నిలిచిపోయి, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ఈసారి మరింత భారీగా పెరిగే ప్రమాదం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఈసారి వర్షాలు తక్కువే

**నైరుతి రుతుపవనాలపై ఐఎండీ తొలి అంచనా**



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతులు, ప్రజలు ఎదురుచూస్తున్న 2026 నైరుతి రుతుపవనాలపై భారత వాతావరణ శాఖ తన తొలి విడత అంచనాలను సోమవారం విడుదల చేసింది. ఈ ఏడాది వర్షాలు సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని, దీర్ఘకాలిక సగటులో సుమారు 90 నుంచి 95 శాతం మధ్య వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా సగటున 92 శాతం వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని, ఇందులో 5 శాతం అటూఇటూగా ఉండవచ్చని పేర్కొంది. 1971 నుంచి 2020 మధ్య కాలంలోని వర్షపాత డేటా ఆధారంగా, దేశంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతం 87 సెం.మీ.గా ఉంది. దీని ఆధారంగానే ఐఎండీ తన అంచనాలను వెల్లడిస్తుంది. కాగా, రుతుపవనాల కదలికలు, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను మరింతగా విశ్లేషించి, మే చివరి వారంలో సవరించిన అంచనాలను విడుదల చేస్తామని ఐఎండీ తెలిపింది. రుతుపవనాలపై ప్రభావం చూపే కీలక అంశాల గురించి కూడా ఐఎండీ వివరించింది. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో బలహీనంగా ఉన్న లా నినా పరిస్థితులు ముగిసి, ఎల్ నినో-సదరన్ ఆసిలేషన్ తటస్థ స్థితికి మారుతున్నాయని తెలిపింది. అయితే, 'మాన్‌సూన్ మిషన్ క్లైమేట్ ఫోర్‌కాస్ట్ సిస్టమ్' మోడల్ ప్రకారం, నైరుతి రుతుపవనాల సమయంలో ఎల్ నినో పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని ఐఎండీ హెచ్చరించింది. సాధారణంగా ఎల్ నినో ఏర్పడినప్పుడు ఆసియా దేశాలలో వర్షాలు తగ్గి, కరవు పరిస్థితులు తలెత్తుతాయి. మరోవైపు హిందూ మహాసముద్రంలో ఇండియన్ ఓషన్ డైపోల్ ప్రస్తుతం తటస్థంగా ఉందని, రుతుపవనాల చివరి దశలో ఇది సానుకూలంగా మారే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేస్తోంది. పసిఫిక్, హిందూ మహాసముద్రాలలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు భారత రుతుపవనాలపై బలమైన ప్రభావాన్ని చూపుతాయి కాబట్టి, ఈ రెండు సముద్రాల్లోని పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నట్లు ఐఎండీ తన ప్రకటనలో స్పష్టం చేసింది.

# స్పైస్ జెట్ కుప్పకూలిపోతుంది

**రూ.144 కోట్ల డిపాజిట్‌పై సంస్థ ఆందోళన.. ఢిల్లీ హైకోర్టులో పిటిషన్**




న్యూఢిల్లీ: కళానిధి మారన్, ఆయనకు చెందిన కేఏఎల్ ఎయిర్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో తమకు చాలాకాలంగా నడుస్తున్న వివాదంలో, రూ.144.5 కోట్లను తక్షణమే డిపాజిట్ చేయాలని ఒత్తిడి తెస్తే తాము కుప్పకూలుతామని ప్రముఖ విమానయాన సంస్థ స్పైస్ జెట్ ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. ఈ నగదు డిపాజిట్‌కు సంబంధించి సంస్థ చెల్లింపు గడువు ఏప్రిల్ 14వ తేదీతో ముగియనున్నది. ఈ నేపథ్యంలో స్పైస్ జెట్ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కారణంగా విమాన సర్వీసులకు ఆటంకం కలగడం, విమాన ఇంధన ధరలు పెరగడం వల్ల నగదు కొరత ఏర్పడిందని స్పైస్ జెట్ కోర్టుకు తెలిపింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ భారీ మొత్తాన్ని నగదు రూపంలో చెల్లించాల్సి వస్తే ఆర్థికంగా దెబ్బతిని తమ వ్యవస్థ కుప్పకూలిపోయే ప్రమాదం ఉందని వాపోయింది. నగదుకు బదులు గురుగ్రామ్‌లో తమ కంపెనీకి ఉన్న ఎకరం వాణిజ్య భూమిని సెక్యూరిటీగా పెట్టుకోవాలని కోరింది. ఈ భూమిని అత్యవసరంగా విక్రయిస్తే 50 శాతం తక్కువ ధరకు అమ్మవలసి వస్తుందని, నష్టానికి ఆస్తులను అమ్ముకునేలా బలవంతం చేయవద్దని కోరింది. వాదనలు విన్న ఢిల్లీ హైకోర్టు తదుపరి విచారణను ఏప్రిల్ 15కు వాయిదా వేసింది. స్పైస్ జెట్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. 2015లో స్పైస్ జెట్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సమయంలో కళానిధి మారన్ తన 58.46 శాతం షేర్లను స్పైస్ జెట్ వ్యవస్థాపకుడు అజయ్ సింగ్ పేరుపై మార్చారు. తాను పెట్టుబడి పెట్టిన రూ.679 కోట్లకు బదులు కన్వర్టబుల్ వారెంట్స్, ప్రిఫరెన్స్ షేర్లను ఇచ్చేలా ఇరువురి మధ్య ఒప్పందం కుదిరింది. తనకు షేర్లు ఇవ్వకపోవడంతో కళానిధి మారన్ మధ్యవర్తిత్వ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. వడ్డీతో సహా కళానిధి మారన్‌కు చెల్లించాలని 2018లో ఈ ట్రైబ్యునల్ ఆదేశించింది. ఈ వివాదానికి సంబంధించి రూ.144.51 కోట్లను కోర్టులో డిపాజిట్ చేయాలని ఢిల్లీ హైకోర్టు గతంలో స్పైస్ జెట్‌ను ఆదేశించింది. దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లినప్పటికీ స్పైస్ జెట్‌కు ఊరట దక్కలేదు. దీంతో ఢిల్లీ హైకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది.


## నష్టాలతో ముగిసిన మార్కెట్




ముంబై: పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ఈక్విటీ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. అయితే, ఇంట్రా డే కనిష్ఠాల నుంచి సూచీలు అనూహ్యంగా కోలుకున్నాయి. ముఖ్యంగా రక్షణ రంగ షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడం మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 702.68 పాయింట్లు నష్టపోయి 76,847.57 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 207.95 పాయింట్లు తగ్గి 23,842.65 వద్ద ముగిసింది. రోజు ప్రారంభంలో భారీ నష్టాల్లోకి జారుకున్న సూచీలు, రెండో అర్ధభాగంలో ట్రేడింగ్ పుంజుకోవడంతో నష్టాలను చాలా వరకు తగ్గించుకోగలిగాయి. పశ్చిమాసియాలో పరిణామాలను ఇన్వెస్టర్లు నిశితంగా గమనిస్తుండటంతో మార్కెట్‌లో అప్రమత్తత కొనసాగింది. ఇది ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. రంగాల వారీగా చూస్తే, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది. ఎఫ్ఎంసీజీ, ఐటీ రంగాల షేర్లు కూడా బలహీనంగా ఉన్నాయి. అయితే, మెటల్ ఇండెక్స్ మిగతా రంగాలతో పోలిస్తే తక్కువ నష్టాలతో నిలిచింది. అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ఇండెక్స్ రాణించడం గమనార్హం. నిఫ్టీలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభపడగా, మారుతీ సుజుకీ, ఇండిగో, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్ వంటి షేర్లు 4.6 శాతం వరకు నష్టపోయాయి. ప్రధాన సూచీల్లాగే బ్రాడర్ మార్కెట్లు కూడా నష్టాల్లోనే ముగిశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.54 శాతం, స్మాల్‌క్యాప్ 0.38 శాతం మేర నష్టపోయాయి. సాంకేతికంగా నిఫ్టీకి 23,900 వద్ద తక్షణ నిరోధం ఉందని, దిగువన 23,500 - 23,600 స్థాయిలు కీలక మద్దతు జోన్‌గా ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## మక్కా ప్రవేశంపై సౌదీ ప్రభుత్వం ఆంక్షలు

రియాద్: హజ్ యాత్ర సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో సౌదీ అరేబియా ప్రభుత్వం మక్కా నగర ప్రవేశంపై కీలక ఆంక్షలు విధించింది. సోమవారం నుంచి అధికారిక అనుమతి పత్రాలు లేని విదేశీయులు, స్థానిక నివాసితులు ఎవరూ మక్కాలోకి ప్రవేశించకూడదని స్పష్టం చేసింది.



యాత్రికుల రద్దీని క్రమబద్ధీకరించడం, భద్రతను పర్యవేక్షించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సౌదీ ప్రెస్ ఏజెన్సీ వెల్లడించింది. కేవలం మక్కాలో పని చేసే వర్క్ పర్మిట్ ఉన్నవారు, అక్కడ జారీ చేసిన రెసిడెన్సీ ఐడీ (ఇఖామా) కలిగిన వారు లేదా చెల్లుబాటు అయ్యే హజ్ పర్మిట్ ఉన్నవారిని మాత్రమే నగరంలోకి అనుమతిస్తారు. నిబంధనలను ఉల్లంఘించి వచ్చే వారిని సరిహద్దు తనిఖీ కేంద్రాల వద్దే నిలిపివేసి వెనక్కి పంపేలా కఠిన చర్యలు చేపట్టారు. మరోవైపు ఉమ్రా వీసాలపై వచ్చిన విదేశీయులకు ఏప్రిల్ 18 వరకు మాత్రమే గడువు విధించారు. ఈ లోపు వారు దేశం విడిచి వెళ్లాల్సి ఉంటుంది. అలాగే ఏప్రిల్ 18 నుండి మే 31 వరకు 'నుసుక్' ప్లాట్‌ఫారమ్ ద్వారా పౌరులు మరియు జీసీసీ దేశాల వారికి ఇచ్చే ఉమ్రా పర్మిట్ల జారీని పూర్తిగా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఏప్రిల్ 18 తర్వాత కేవలం హజ్ వీసా ఉన్న వారిని మాత్రమే మక్కాలోకి అనుమతించనున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలతో పాటు కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని సౌదీ ప్రభుత్వం హెచ్చరించింది.

## మతమార్పిడి ఆందోళనకరం

**టాటా సన్స్ ఛైర్మన్ వెల్లడి**

నాసిక్: టీసీఎస్ నాసిక్ క్యాంపస్‌లో జరిగిన లైంగిక వేధింపుల వ్యవహారంపై టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ స్పందించారు. ఇది తీవ్ర ఆందోళనకరమైన అంశమని అన్నారు. ఈ ఘటను తీవ్రంగా పరిగణించామని, అందుకే ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై ఓ సీనియర్ ఎగ్జిక్యూటివ్ నేతృత్వంలో విచారణకు ఆదేశించామని అన్నారు. వాస్తవాలను నిర్ధారించడానికి, ఇందుకు బాధ్యులైన వ్యక్తులను గుర్తించడానికి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆరతి సుబ్రమణియన్ నేతృత్వంలో సమగ్ర విచారణ జరుగుతోందని అన్నారు. మహిళల పట్ల ఇలాంటి అనుచిత ప్రవర్తనను టాటా గ్రూప్ ఎట్టి పరిస్థితుల్లో సహించదని స్పష్టం చేశారు. దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. కాగా, టీసీఎస్ నాసిక్ క్యాంపస్‌లో లైంగిక వేధింపులు, మతమార్పిడులకు పాల్పడ్డారన్న ఆరోపణలపై కొంతమంది ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు. హెచ్ఆర్ మేనేజర్ సహా ఏడుగురు ఉద్యోగులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## మహిళా బిల్లుపై అఖిలపక్ష భేటీ: ఖర్గే

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ చట్టం (నారీ శక్తి వందన్ అధినియమ్) అమలుపై చర్చించేందుకు కాంగ్రెస్ పార్టీ నడుం బిగించింది. ఈ చట్టంపై భాగస్వామ్య పక్షాలన్నింటితో చర్చలు జరపడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, ఏప్రిల్ 15న తమ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. మహిళా రిజర్వేషన్ల వంటి జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశంపై కేంద్రం లోతైన చర్చలు జరపడం లేదని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే పాకులాడుతోందని ఖర్గే విమర్శించారు. ప్రభుత్వం అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేయకపోవడం వల్ల తామే చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నది కాంగ్రెస్ చిరకాల వాంఛ అని, గతంలో సోనియా గాంధీ ఈ దిశగా గట్టి ప్రయత్నాలు చేశారని గుర్తుచేశారు. అప్పట్లోనే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత తమదేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు వ్యక్తపరిచే అభిప్రాయాలను, తీసుకున్న నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తామని ఖర్గే వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ల అమలులో పారదర్శకత, వేగం ఉండాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఇప్పటికే బీజేపీ నేతలు మహిళా రిజర్వేషన్ల విషయంలో తమ వైఖరిని స్పష్టం చేస్తున్న తరుణంలో, కాంగ్రెస్ నిర్వహిస్తున్న ఈ భేటీ రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

## చొరబాటుదారులను తరిమికొట్టే టైమైంది: అమిత్ షా

రాణిగంజ్: దేశంలో నక్సలిజాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం పూర్తిగా అణిచివేసిందని, ఇప్పుడు చొరబాటుదారులను తరిమికొట్టే సమయం ఆసన్నమైందని కేంద్రమంత్రి అమిత్ షా అన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని రాణిగంజ్ ప్రాంతంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బెంగాల్ ప్రజలు బాంబులు, తూటాలకు ఓట్లతో జవాబు ఇస్తారని అన్నారు. మమతా బెనర్జీని గద్దె దించాలని రాష్ట్ర ప్రజలు నిర్ణయించుకున్నారని ఆయన అన్నారు. రాబోయే ప్రభుత్వం బీజేపీదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పోలింగ్ రోజు తృణమూల్ కాంగ్రెస్ గూండాలు అరాచకాలకు స్వస్తి చెప్పి ఇళ్లలోనే ఉండిపోవాలని లేదంటే తమ ప్రభుత్వం వచ్చాక వారిని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. బెంగాల్ సహా అన్ని రాష్ట్రాల్లో ఉన్న చొరబాటుదారులను వెనక్కి పంపిస్తామని అమిత్ షా అన్నారు. మమతా బెనర్జీ ప్రభుత్వం గతంలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వానికి మద్దతిచ్చారని, కానీ నాటి కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదం, చొరబాట్లపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. పైగా ఉగ్రవాదులకు బిర్యానీతో విందు ఇచ్చిందని ధ్వజమెత్తారు. పహల్గామ్ ఉగ్రదాడికి మోదీ ప్రభుత్వం ప్రతీకారం తీర్చుకుందని, పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులను కోలుకోలేని దెబ్బ తీసిందని అన్నారు. రాత్రి సమయాల్లో మహిళలు ఒంటరిగా తిరగాల్సిన అవసరం ఏమొచ్చిందని గతంలో మమతా బెనర్జీ అన్నారని, అలాంటి మాటలు ఆమె పదవికి సిగ్గుచేటు అన్నారు. ఆర్జీకర్ లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్ధరాత్రి కూడా మహిళలు ధైర్యంగా తిరిగే వాతావరణాన్ని తాము బెంగాల్‌లో సృష్టిస్తామని అమిత్ షా తెలిపారు.

## ప్రేయసితో ట్రూడో చెట్టాపట్టాల్

కాలిఫోర్నియా: కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో, అమెరికన్ పాప్‌స్టార్ కేటీ పెర్రీ డేటింగ్‌లో ఉన్నట్లు కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. తాజాగా ఈ జంట కాలిఫోర్నియాలో జరిగిన ఒక సంగీత వేడుకలో కలిసి సందడి చేసింది. ఇందుకు సంబంధించిన ఫొటోలను, వీడియోలను కేటీ పెర్రీ సోషల్ మీడియాలో పంచుకుంది. చేతిలో చేయి వేసి నడవడం, కూర్చుని డ్రింక్స్ తాగడం వంటి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దాదాపు పదేళ్ల పాటు కెనడా ప్రధానిగా ఉన్న జస్టిన్ ట్రూడో, గత సంవత్సరం ప్రారంభంలో రాజీనామా చేశారు. ఈ క్రమంలో గత సంవత్సరం జూలైలో వీరిద్దరు మాంట్రియాల్‌లోని ఒక రెస్టారెంటులో కనిపించారు. వీరు డేటింగ్‌లో ఉన్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. ఆ తర్వాత విలాసవంతమైన నౌకపై వీరు సన్నిహితంగా ఉన్న ఫొటోలు బయటకు వచ్చాయి. డేటింగ్ చేస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతున్నప్పటికీ వీరిద్దరు మాత్రం స్పందించలేదు. కానీ తరచూ వీరిద్దరు కలిసి దర్శనమిస్తున్నారు. ట్రూడో తన భార్య సోఫీ గ్రెగోరీకి 2023లో విడాకులిచ్చారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. నటుడు ఓర్లాండో బూమ్‌తో ఏడేళ్లుగా కలిసి ఉంటున్న కేటీ పెర్రీ గత సంవత్సరం అతనితో విడిపోయారు.

ఈవార్తలు
# వినోదవాణి CINEMA
మంగళవారం 14-4-2026, జగిత్యాల | www.evarthalu.com


## వయ్యారి చిత్రం


సాక్షి మాలిక్



## కల్కి 2కి దూరంగా 'మైత్రి'

రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో చాలా బిజీగా సమయాన్ని గడుపుతున్నారు. ప్రస్తుతం ప్రభాస్, హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పౌజీ చిత్రంతో పాటు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న స్పిరిట్, అలాగే నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న కల్కి 2898 ఏడి పార్ట్ 2 చిత్రంలో నటిస్తున్నాడు. ఈయన నటిస్తున్న అన్ని చిత్రాల్లో ఏదో ఒక రకంగా మైత్రి మూవీ మేకర్స్ సంస్థ ఇన్వాల్వ్ అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న స్పిరిట్ మూవీకి సంబంధించిన రెండు తెలుగు రాష్ట్రాల థియేటర్ హక్కులను భారీ ధరకు మైత్రి సంస్థ దక్కించుకున్నట్లు తెలుస్తోంది. ఫౌజీ చిత్రాన్ని కూడా మైత్రి మూవీ మేకర్సే నిర్మిస్తోంది. కానీ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'కల్కి పార్ట్ 2' విషయంలో మాత్రం ఈ సంస్థ పెద్దగా ఇన్వాల్వ్ కావడం లేదని టాలీవుడ్ సర్కిల్లో ఓ వార్త చెక్కర్లు కొడుతోంది. ఇటీవల సంక్రాంతికి ప్రభాస్ హీరోగా రూపొందిన రాజా సాబ్ చిత్రం మంచి అంచనాల నడుమ విడుదలై బాక్సాఫీస్ దగ్గర ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. మరి ప్రస్తుతం ప్రభాస్ నటిస్తున్న ఈ మూడు చిత్రాలపై మాత్రం అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలు ఏ స్థాయి విజయాలను అందుకుంటాయో చూడాలి.

## లెజెండరీ సింగర్‌కు తుది వీడ్కోలు



భారతీయ సంగీత ప్రపంచంలో ఓ అద్భుత అధ్యాయం ముగిసింది. లెజెండరీ సింగర్ ఆశా భోస్లే(92) అంత్యక్రియలు ముగిశాయి. ముంబయిలోని దాదర్‌లోని శివాజీ పార్క్ శ్మశానవాటికలో కుటుంబ సభ్యులు, ప్రముఖుల అశ్రుతర్పణల మధ్య ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు ముగిశాయి. ఛాతిలో ఇన్ఫెక్షన్ కారణంగా ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చేరిన ఆశా భోస్లే నిన్న తుదిశ్వాస విడిచారు. ఎనిమిది దశాబ్దాలకు పైగా భారతీయ సంగీతానికి తన గాంత్రంతో వన్నె తెచ్చిన ఆశాభోస్లే భౌతిక కాయాన్ని అభిమానులు, ప్రజల సందర్శనార్థం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు లోయర్ పారెల్‌లోని ఆమె నివాసంలో ఉంచారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు శివాజీ పార్క్ శ్మశానవాటికకు అంతిమ యాత్ర కొనసాగింది. దారిపొడుగునా వేలాది మంది అభిమానుల చేరి తమ అభిమాన గాయనికి అంతిమ వీడ్కోలు పలికారు. పసుపు రంగు పూలతో అలంకరించిన ఆ శవపేటిక వాహనంపై, సాంప్రదాయ మహారాష్ట్ర 'నాథ్' ధరించిన గాయని యొక్క పెద్ద ఛాయాచిత్రాన్ని కూడా ఉంచారు.

## నాగ్-చైతూ కాంబోలో మరో సినిమా!



యువ సామ్రాట్ నాగ చైతన్య త్వరలో 'వృషకర్మ'తో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఇటీవల 'తండేల్'తో భారీ విజయాన్ని అందుకున్న తర్వాత నాగచైతన్య నుంచి వస్తున్న ఈ భారీ చిత్రంపై అక్కినేని ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకుల్లో కూడా భారీ అంచనాలు ఉన్నాయి. ఇక 'వృషకర్మ'తో పాటు చైతు చేతిలో పలు ప్రాజెక్టులో ఉండగా.. దర్శకుడు కళ్యాణ్ కృష్ణతో ఓ సినిమా ఓకే చేసినట్లు టాక్. ఇప్పటికే కళ్యాణ్ కృష్ణ దర్శకుడిగా 'బంగార్రాజు' సినిమా వచ్చిన విషయం తెలిసిందే. ఇందులో నాగచైతన్యతో పాటు నాగార్జున కూడా నటించాడు. ఇప్పుడు ఇదే కాంబినేషన్ మరోసారి స్క్రీన్‌పైకి రాబోతున్నట్లు టాలీవుడ్ వర్గాల వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో నిజం ఎంత ఉందో తెలియాలంటే దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది.

## త్రిప్తి డిమ్రి.. తొలి నటిగా రికార్డు!



హాలీవుడ్ నుంచి అన్ని వుడ్స్ ముద్దుగుమ్మలు బ్రాండ్ అంబాసిడర్‌గా చేయాలనుకునే బ్రాండ్.. విక్టోరియాస్ సీక్రెట్. ఈ కంపెనీ ఇన్నర్స్, నైట్ వేర్‌తో పాటు బ్యూటీ ప్రొడక్ట్స్‌ను సెల్ చేస్తూ ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ బ్రాండ్‌కి మార్కెట్ ఉంది. అందుకే ఈ కంపెనీ బ్రాండ్ అంబాసిడర్‌గా చేస్తే ప్రపంచం మొత్తం చూస్తుంది. అందుకే ఈ కంపెనీ కోసం బ్రాండింగ్ చేయాలని ఎంతో మంది కోరుకుంటూ ఉంటారు. ఇండియన్ స్టార్స్‌కి ఈ అవకాశం ఇప్పటి వరకు రాలేదు. ఎట్టకేలకు విక్టోరియా సీక్రెట్ బ్రాండ్‌కి ఇండియన్ స్టార్ సెలబ్రిటీ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక అయ్యింది. బాలీవుడ్ నుంచి ప్రియాంక చోప్రా, దీపికా పదుకునే, ఆలియా భట్ వంటి ఎంతో మంది సీనియర్ అండ్ స్టార్ బ్యూటీస్ ఉన్నప్పటికీ ఇప్పుడిప్పుడే కెరీర్ ను ఆరంభిస్తున్న హాట్ బ్యూటీ త్రిప్తి డిమ్రికి ఆ ఛాన్స్ దక్కింది. గతంలో ఒకరు ఇద్దరు హీరోయిన్స్ ఇన్నర్స్ బ్రాండ్‌కి అంబాసిడర్‌గా వ్యవహరించేందుకు ఆసక్తి చూపించలేదనే వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఆ తర్వాత హీరోయిన్స్ చాలా మంది ఆ బ్రాండ్‌కి అంబాసిడర్‌గా వ్యవహరించాలని కోరుకున్నారు. కానీ ఏ ఒక్కరికి ఆ ఛాన్స్ రాలేదు. కానీ అనూహ్యంగా త్రిప్తి డిమ్రికి ఆ ఛాన్స్ రావడం ప్రతి ఒక్క బాలీవుడ్ సెలెబ్రిటీని ఆశ్చర్యంలో ముంచెత్తింది.

## త్రిష ఇంటికి ఫేక్ బాంబు బెదిరింపు మెయిల్



నటి త్రిష నివాసంలో బాంబు ఉందంటూ డీజీపీ కార్యాలయానికి అందిన ఈమెయిల్ పోలీసులను పరుగులు పెట్టించింది. గతంలో సూపర్ స్టార్ రజనీకాంత్, ధనుష్ ఇళ్లకు కూడా ఇలాంటి ఫేక్ బెదిరింపులు వచ్చిన తరుణంలో, ఇప్పుడు త్రిష ఇంటిని టార్గెట్ చేయడం తమిళనాట హాట్ టాపిక్‌గా మారింది. చెన్నైలోని త్రిష నివాసంలో పేలుడు పదార్థాలు అమర్చినట్లు ఉదయం 9:30 గంటలకు అధికారులకు ఈమెయిల్ వచ్చింది. దీంతో వెంటనే అప్రమత్తమైన తేనాంపేట పోలీసులు, బాంబు స్క్వాడ్‌తో కలిసి ఆమె ఇంటిని చుట్టుముట్టారు. గంటల తరబడి అణువణువూ గాలించినా ఎక్కడా ఏమీ దొరకకపోవడంతో అది 'ఫేక్ బెదిరింపు' అని నిర్ధారించారు. త్రిష ఇంట్లో లేని సమయంలో ఇలాంటి ఘటన జరగడం, పైగా ఈ ఏడాదే ఇది రెండోసారి కావడంతో ఆమె అభిమానులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా సెలబ్రిటీల ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్న ఈ ఈమెయిల్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయి? అనే కోణంలో సైబర్ క్రైమ్ పోలీసులు ఆరా తీస్తున్నారు. ఏ ఐపీ అడ్రస్ ద్వారా ఈ మెయిల్ పంపారో గుర్తిస్తే అసలు సూత్రధారులను పట్టుకోవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇక పోలీసు యంత్రాంగాన్ని పక్కదారి పట్టిస్తూ, సెలబ్రిటీలను ఇబ్బందులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ప్రస్తుతానికి త్రిష నివాసం వద్ద పరిస్థితి ప్రశాంతంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. త్రిష ప్రస్తుతం తన సినిమాలతో బిజీగా ఉన్న తరుణంలో ఇలాంటి అవాంఛనీయ ఘటనలు ఎదురవ్వడం కలవరపెడుతోంది.

## తలబిర్రుతో కెరీర్ నాశనం



సినీ పరిశ్రమలో విజయం అనేది డబ్బుతోనే రాదు. క్రమశిక్షణ - పని పట్ల ఉండే వినయంపై ఆధారపడి ఉంటుందని నటి, నిర్మాత నేహా పెండ్సే అభిప్రాయపడ్డారు. నిర్మాత అనే హోదాను తలకెక్కించుకుంటే కెరీర్ ముగిసిపోవడానికి ఎంతో సమయం పట్టదని హెచ్చరించారు. తన నిర్మాణ సంస్థలో పనిచేస్తున్నప్పుడు తాను ఎప్పుడూ ఒక బాధ్యతాయుతమైన పని మనిషిలాగే ఆలోచిస్తానంది. తానే బాస్ అనే అహంకారం తన దరిచేరనివ్వనని స్పష్టం చేశారు. ఒక సినిమా విజయవంతం కావాలంటే సెట్స్‌లో ఉండే వాతావరణం చాలా ముఖ్యం. నిర్మాతకు గర్వం ఉంటే? అది సినిమా నిర్మాణంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని నేహా అభిప్రాయపడింది. నేను నిర్మాతను కదా అని సెట్‌కు ఆలస్యంగా వెళ్లడం లేదా ఇతరులను తక్కువ చేసి చూడటం వంటి పనులు చేస్తే సృజనాత్మకత నశిస్తుంది. ఎప్పుడైతే మనం ఇతరుల సమయాన్ని, కష్టాన్ని గౌరవిస్తామో, అప్పుడే అందరూ మన ప్రాజెక్ట్ కోసం మనస్ఫూర్తిగా పని చేస్తారు అని పేర్కొన్నారు. నేహా పెండ్సే దృష్టిలో నిర్మాత అనే వ్యక్తి కేవలం పెట్టుబడిదారుడు మాత్రమే కాదు. ఒక సమన్వయకర్త. సెట్‌లో ఉండే ప్రతి టెక్నీషియన్ నుండి నటుల వరకు అందరినీ ఒకే తాటిపైకి తీసుకురావాల్సిన బాధ్యత నిర్మాతపై ఉంటుంది.





# సన్ స్ట్రోక్!

## రాజస్థాన్‌కు

ప్రఫుల్ హింగే ఒకే ఓవర్‌లో మూడు వికెట్లు

చిచ్చర పిడుగు వైభవ్ సూర్యవంశీ గోల్డెన్ డక్

శతకం చేజార్చుకున్న ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్

### హైదరాబాదీ బౌలర్ల దెబ్బకు ఆర్ఆర్ బెంబేలు

**ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అదిరిపోయే విజయాన్నందుకుంది. సోమవారం ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అసాధారణ బౌలింగ్ ప్రదర్శనతో 57 పరుగుల భారీ తేడాతో రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చేసింది. టేబుల్ టాపర్ రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తుగా ఓడించడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆత్మవిశ్వాసం రెట్టింపు కావడంతో పాటు నెట్ రన్‌రేట్ కూడా మెరుగైంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఇది రెండో విజయం.**

**అరంగేట్ర పేసర్లు ప్రఫుల్ హింగే, సకీబ్ హుస్సేన్ నాలుగేసి వికెట్లతో రాజస్థాన్ రాయల్స్ పతనాన్ని శాసించారు. బ్యాటింగ్‌లో కెప్టెన్ ఇషాన్ కిషన్ అసాధారణ ప్రదర్శనతో సత్తా చాటాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 216 పరుగుల భారీ స్కోర్ చేసింది.**



కెప్టెన్ ఇషాన్ కిషన్(44 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లతో 91) తృటిలో శతకం చేజార్చుకోగా.. హెన్రీచ్ క్లాసెన్(26 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 40), నితీష్ కుమార్ రెడ్డి(13 బంతుల్లో 4 సిక్స్‌లతో 28), సలీల్ అరోరా(13 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 24 నాటౌట్) విలువైన పరుగులు చేశారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్(2/37) రెండు వికెట్లు తీయగా.. సందీప్ శర్మ, తుషార్ దేశ్‌పాండే, రియాన్ పరాగ్ తలో వికెట్ తీసారు. రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్లలో డోనవన్ ఫెరీరా(44 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 69), రవీంద్ర జడేజా(32 బంతుల్లో 5 ఫోర్లతో 45) టాప్ స్కోరర్లుగా నిలిచారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో అరంగేట్ర పేసర్లు ప్రఫుల్ హింగే(4/34), సకీబ్ హుస్సేన్(4/24) నాలుగు వికెట్లు తీయగా.. ఎషాన్ మలింగా(2/31) రెండు వికెట్లు పడగొట్టాడు.

## మలుపు తిప్పిన ప్రఫుల్ హింగే..

217 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో రాజస్థాన్ రాయల్స్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ అరంగేట్ర పేసర్ ప్రఫుల్ హింగే కోలుకోలేని దెబ్బతీసాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్ రెండో బంతికే డేంజరస్ వైభవ్ సూర్యవంశీని గోల్డెన్ డకౌట్‌గా పెవిలియన్ చేర్చిన ప్రఫుల్ హింగే.. నాలుగో బంతికి ధ్రువ్ జురెల్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆఖరి బంతికి ప్రిటోరియస్‌ను క్యాచ్ ఔట్ చేసి అరంగేట్ర ఓవర్‌లోనే మూడు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా చరిత్రకెక్కాడు. ప్రఫుల్ హింగే ధాటికి రాజస్థాన్ రాయల్స్ ఒక్క పరుగుకే మూడు వికెట్లు కోల్పోయింది. ఈ ఒక్క ఓవరే రాజస్థాన్ రాయల్స్ పతనాన్ని శాసించింది. ఆ తర్వాత మరో అరంగేట్ర పేసర్ సకీబ్ హుస్సేన్(4/24) నాలుగు వికెట్లతో చెలరేగి సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయాన్ని లాంఛనం చేశాడు. ఈ ఇద్దరూ అరంగేట్ర పేసర్ల అద్భుత ప్రదర్శనతో బలహీనంగా ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్ యూనిట్ భీకరంగా మారింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో 219 పరుగుల భారీ స్కోర్‌ను కాపాడుకోలేకపోయిన సన్‌రైజర్స్.. ఈ మ్యాచ్‌లో మాత్రం అదిరిపోయే ప్రదర్శన కనబర్చింది.



## టాక్ ఆఫ్ ది టౌన్‌గా ప్రఫుల్

ప్రఫుల్ హింగే ప్రస్తుతం దేశవ్యాప్తంగా మారుమోగుతున్న పేరు. ఐపీఎల్ చరిత్రలోనే ఒకే ఓవర్‌లో మూడు వికెట్లు తీసిన బౌలర్‌గా ఈ సన్‌రైజర్స్ హైదరాబాద్(రా=ఎ) యువ పేసర్ చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా సోమవారం ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌తో ఈ క్యాష్ రిచ్ లీగ్‌లోకి అరంగేట్రం చేసిన ప్రఫుల్ హింగే.. తొలి ఓవర్‌లోనే మూడు వికెట్లు పడగొట్టాడు. రెండో బంతికే రాజస్థాన్ రాయల్స్ టీనేజ్ సెన్సేషన్, ఇన్ ఫామ్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీని క్యాచ్ ఔట్ చేసిన ప్రఫుల్ హింగే.. నాలుగో బంతికి ధ్రువ్ జురెల్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆఖరి బంతికి ప్రిటోరియస్‌ను క్యాచ్ ఔట్ చేసి సరికొత్త చరిత్రను లిఖించాడు. అరంగేట్రంలోనే తొలి ఓవర్‌లోనే మూడు వికెట్లు తీసిన ఏకైక పేసర్‌గా నిలిచాడు. తన రెండో ఓవర్‌లో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్(4)ను కూడా క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో ఈ యువ పేసర్ టాక్ ఆఫ్ ది నేషన్‌గా నిలిచాడు. ఈ కుర్రాడి గురించి తెలుసుకునేందుకు నెటిజన్లు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కి చెందిన ప్రఫుల్ హింగే 2002 జనవరి 18న జన్మించాడు. అందరి పిల్లల్లానే తన ఇంటి పక్కన ఉన్న మైదానంలో ప్రఫుల్ హింగే క్రికెట్ ఆడేవాడు. ఆరంభంలో ప్రఫుల్ హింగేను క్రికెట్ ఆడకుండా తన తండ్రి అడ్డుకున్నాడు. కానీ అతని 12 ఏళ్ల వయసులో సమ్మర్ క్యాంప్ ట్రయల్స్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చడంతో ప్రోత్సహించాడు. 13 ఏళ్ల వయసులోనే ప్రఫుల్ హింగే తన బౌలింగ్ నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. సైకిల్‌పై ప్రాక్టీస్‌కు వెళ్తూ తరచుగా స్కూల్‌కు లేట్‌గా వెళ్లేవాడు. 16 ఏళ్ల వయసులో కోచ్ సంజీవ్ ఆధ్వర్యంలో విదర్భ క్రికెట్ అసోసియేషన్ అకాడమీలో చేరడం అతని జీవితాన్ని మలుపు తిప్పింది. అండర్-19 ట్రయల్స్‌లో 36 వికెట్లు పడగొట్టి అందరి దృష్టిని ఆకర్షించాడు. విదర్భ దేశవాళీ జట్టు తరపున ఆడుతున్న ప్రఫుల్ హింగే.. రంజీ ట్రోఫీలో మెరుగైన ప్రదర్శన కనబర్చాడు. విదర్భ ప్రో టీ20 లీగ్‌లో నెకో మాస్టర్ బ్లాస్టర్ జట్టు తరపున 6 మ్యాచ్‌ల్లో 8 వికెట్లు తీసి తన టీమ్ ఛాంపియన్‌గా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. గతేడాది తమిళనాడుతో జరిగిన రంజీ మ్యాచ్ ప్రఫుల్ ఐదు వికెట్లతో సత్తా చాటడం చూసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్ కోచ్ వరుణ్ ఆరోన్ ట్రయల్స్‌కు ఆహ్వానించాడు. ట్రయల్స్‌లో ప్రఫుల్ సత్తా చాటడంతో ఐపీఎల్ 2026 మినీ వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ అతన్ని రూ.30 లక్షల బేస్ ప్రైజ్‌కు కొనుగోలు చేసింది.

## మహిళల టీ20 వరల్డ్‌కప్

### 82 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించిన ఐసీసీ

ఈ ఏడాది జూన్‌లో మహిళల టీ20 వరల్డ్‌కప్ జరగనున్నది. దీని కోసం ఇవాళ ఐసీసీ ప్రైజ్‌మనీ ప్రకటించింది. వరల్డ్‌కప్‌లో విజేతలకు అందజేసే ప్రైజ్‌మనీని రికార్డు స్థాయిలో పెంచేసింది. రెండు నెలల పాటు ఇంగ్లండ్, వేల్స్‌లో జరిగే వరల్డ్‌కప్ కోసం సుమారు 82 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించింది ఐసీసీ. గత ఎడిషన్‌తో పోలిస్తే సుమారు 10 శాతం ప్రైజ్‌మనీ పెంచారు. ఈసారి ఈ టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొననున్నాయి. 2024లో కేవలం 10 జట్లు మాత్రమే పాల్గొన్నాయి. జూన్ 12 నుంచి జూలై 5వ తేదీ వరకు ఏడు వేదికల్లో టోర్నీ జరగనున్నది. లార్డ్స్ మైదానంలో ఫైనల్ మ్యాచ్ ఆడుతారు. గత వరల్డ్‌కప్‌లో ప్రైజ్‌మనీ 74 కోట్లు కాగా, ఈసారి 82 కోట్లు ఇవ్వనున్నారు. వరల్డ్‌కప్ విజేతలు ఈసారి 21.8 కోట్ల ప్రైజ్‌మనీ గెలుచుకుంటారు. ఇక రన్నరప్‌కు 10 కోట్లు ఇవ్వనున్నారు. సెమీఫైనల్లోకి ఎంటరైన జట్లకు 6.29 కోట్లు ఇవ్వనున్నారు. ఇక గ్రూపు మ్యాచ్ ఆడిన ప్రతి జట్టుకు 29 లక్షలు ఇవ్వనున్నారు. ప్రతి జట్టుకు కనీసం రెండు కోట్లు దక్కే అవకాశాలు ఉన్నట్లు ఐసీసీ తన ప్రకటనలో పేర్కొన్నది. జూన్ 12వ తేదీన బర్మింగ్‌హామ్‌లో శ్రీలంక, ఇంగ్లండ్ మధ్య ఫస్ట్ మ్యాచ్ జరుగుతుంది. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇండియా, ఐర్లాండ్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, పాకిస్థాన్ , స్కాట్‌ల్యాండ్, దక్షిణాఫ్రికా, వెస్ట్ ఇండీస్ కూడా టోర్నీలో ఉన్నాయి. 24 రోజుల్లో మొత్తం 33 మ్యాచ్‌లు ఆడనున్నారు.





## మొన్న ధోనీ.. నిన్న రో-కో!

### సూపర్ స్టార్లకు గాయాల బెదర

**ఐపీఎల్‌కు దూరమవుతున్న దిగ్గజాలు**

ఇప్పటికే గాయాల బెడదతో ఐపీఎల్ తొలి మ్యాచ్‌లకు మహేంద్ర సింగ్ ధోనీ దూరం కాగా, తాజాగా, ఆర్సీబీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ చీలమండ గాయంతో ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం. బ్యాటింగ్ సమయంలో 38 బంతుల్లో 50 పరుగులు చేసి జట్టుకు మంచి పునాది వేసిన కోహ్లీ.. ఆ తర్వాత ఫీల్డింగ్‌కు రాలేదు. విరాట్ కోహ్లీ స్థానంలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా సుయాష్ శర్మ మైదానంలోకి వచ్చాడు. కోహ్లీ వంటి చురుకైన ఆటగాడు మైదానంలో లేకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే గాయం తీవ్రత ఎంత ఉందనేది ఇంకా తెలియాల్సి ఉంది. లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో జరగబోయే తదుపరి మ్యాచ్‌కు ఆయన అందుబాటులో ఉంటారా లేదా అన్నది ఆర్సీబీ యాజమాన్యం ఇచ్చే అధికారిక ప్రకటనపై ఆధారపడి ఉంటుంది. ఈ మ్యాచ్ కేవలం కోహ్లీకే కాదు.. ముంబై ఇండియన్స్ స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మకు కూడా కలిసి రాలేదు. 241 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఉన్న ముంబైకి రోహిత్ గాయం పెద్ద దెబ్బ తీసింది. హ్యామ్‌స్ట్రింగ్ సమస్య కారణంగా రోహిత్ 19 పరుగుల వద్ద ఉండగానే రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగారు. ఆ తర్వాత ఆయన తిరిగి బ్యాటింగ్‌కు రాలేదు. ఇలా.. భారత దిగ్గజ ఆటగాళ్లు గాయపడటం క్రికెట్ వర్గాల్లో ఆందోళన కలిగిస్తోంది.

## అంపైర్లతో ఆట.. టీమ్ డేవిడ్‌కు ఫీజు కోత

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ టీమ్ డేవిడ్‌తో పాటు ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ భారీ జరిమానా విధించింది. ఆదివారం వాంఖడే స్టేడియం వేదికగా ముంబై, ఆర్సీబీ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ ఇద్దరూ ఐపీఎల్ నియామవళిని ఉల్లంఘించారు. అంపైర్ల మాటలను బేఖాతరు చేస్తూ.. బంతినివ్వకుండా వారితో ఆటాడిన టీమ్ డేవిడ్ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించిడంతో పాటు ఓ డీమెరిట్ పాయింట్ కేటాయిస్తూ మ్యాచ్ రిఫరీ చర్యలు తీసుకున్నాడు. స్లో ఓవర్ రేట్‌కు కారణమైన హార్దిక్ పాండ్యాకు హెచ్చరికతో పాటు రూ. 12 లక్షల జరిమానా విధించారు. అంపైర్ల ఫిర్యాదుతో మ్యాచ్ రిఫరీ ఈ చర్యలు తీసుకున్నాడు. ఇద్దరూ ఆటగాళ్లు తమ తప్పిదాలను అంగీకరించడంతో పాటు శిక్షకు అంగీకరించారు. ఆర్సీబీ ఇన్నింగ్స్ సందర్భంగా డ్యూ కారణంతో అంపైర్లు బంతిని మార్చారు. అయితే ఆ బంతి ఆకారం కోడిగుడ్డు ఆకారంలో ఉందంటూ గాల్లోకి ఎగిరివేస్తూ టీమ్ డేవిడ్ ఆట ఆడాడు. అంపైర్లు ఎంత చెప్పినా బంతి ఇవ్వకుండా అలానే చేశాడు. చివరకు అంపైర్ గట్టింగా మందలించడంతో బంతి ఇచ్చాడు. అంపైర్ల మాటను వినకపోవడం ఐపీఎల్ రూల్ 2.4 కింద లెవెల్ 1 ఉల్లంఘనగా పరిగణిస్తారు. ఈ రూల్ ప్రకారం అతనిపై మ్యాచ్ రిఫరీ చర్యలు తీసుకున్నారు. మరోవైపు హార్దిక్ పాండ్యా నిర్ణీత సమయం కన్నా ఒక ఓవర్ తక్కువగా వేసాడు. ఈ సీజన్‌లో స్లో ఓవర్ రేట్ విషయంలో ముంబై ఇండియన్స్ చేసిన మొదటి తప్పు ఇది.

## కెప్టెన్సీ నాకు కొత్త కాదు: ఇషాన్

కెప్టెన్సీ తనకు కొత్త కాదని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్ అన్నాడు. అండర్ 19 స్థాయి నుంచి తాను కెప్టెన్సీ చేస్తున్నానని గుర్తు చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో ఉప్పల్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. టాస్ సందర్భంగా మాట్లాడిన ఇషాన్ కిషన్ తుది జట్టులో రెండు మార్పులు చేసినట్లు వెల్లడించాడు. 'నేను చాలా కాలంగా కెప్టెన్సీ బాధ్యతలు నిర్వహిస్తున్నాను. గతంలో భారత అండర్-19 జట్టుతో పాటు నా రాష్ట్ర జట్టుకు కూడా కెప్టెన్‌గా వ్యవహరించాను. సారథ్యం ఆట పట్ల మరింత ఏకాగ్రతతో ఉంచడంతో పాటు పరిస్థితులపై మంచి అవగాహన ఉండేలా చేస్తుంది. .

## తిలక్ వర్మకు అంత సీన్ లేదు: కృష్ణమాచారి శ్రీకాంత్

ఐపీఎల్ 2026 సీజన్లో ముంబై ఇండియన్స్ జట్టు కష్టాలు ముదురుతున్నాయి. ఈ సీజన్‌లో వరుసగా మూడు ఓటములతో పాయింట్ల పట్టికలో 8వ స్థానానికి పడిపోయిన ముంబై జట్టుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్సీబీతో జరిగిన ఉత్కంఠ పోరులోనూ 18 పరుగుల తేడాతో పరాజయం పాలు కావడం జట్టులో ఉన్న లోపాలను మరోసారి బయటపెట్టింది. ముఖ్యంగా ఆ జట్టు మిడిలార్డర్ బ్యాటర్ తిలక్ వర్మ ప్రదర్శనపై మాజీ చీఫ్ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తిలక్ వర్మకు విధ్వంసకర బ్యాటింగ్ చేసే శక్తి లేదని క్రిస్ శ్రీకాంత్ కుండబద్ధలు కొట్టినట్లు చెప్పారు. ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటిదార్ కేవలం 20 బంతుల్లో 53 పరుగులు చేసి మ్యాచ్ ముంబై నుంచి లాగేసుకున్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. తిలక్ వర్మ కనీసం అలాంటి ప్రభావవంతమైన ఇన్నింగ్స్ ఒక్కడి కూడా ఆడలేకపోతున్నాడని శ్రీకాంత్ విమర్శించారు. టీ20 క్రికెట్లో నిలకడ కంటే ఇంపాక్ట్ చూపడమే ముఖ్యమని క్రిస్ శ్రీకాంత్ అభిప్రాయపడ్డారు. తిలక్ వర్మ గత రెండు మూడు సీజన్ల నుంచి ముంబైకి భారంగా మారాడని.. తిలక్ 10 మ్యాచ్‌ల్లో 7 మ్యాచ్ లు ఆడి తక్కువ పరుగులు చేయడం కంటే.. ఆడే 4 మ్యాచ్‌ల్లోనైనా జట్టును ఒంటిచేత్తో గెలిపించేలా ఆడాలని ఆయన సూచించారు.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
మంగళవారం 14-4-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

# యువశక్తే దేశ పెట్టుబడి

నేటి ఆధునిక ప్రపంచంలో ఒక దేశ ఆర్థిక సామాజిక గమనాన్ని నిర్దేశించేది ఆ దేశ యువత మాత్రమే. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశంగా భారతదేశం నేడు ఒక అరుదైన 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' (జనాభా లబ్ధి) దశలో ఉంది. అయితే, ఈ అపారమైన మేధోసంపత్తి, శ్రమశక్తి కేవలం విదేశీ కార్పొరేట్ సంస్థల సేవకే పరిమితం కావడం ఆందోళనకరం. మేధో వలసలు పెరిగిపోతున్న తరుణంలో, మన యువత తమ దృష్టిని 'ఉద్యోగ అన్వేషణ' నుండి 'ఉద్యోగ సృష్టి' వైపు మళ్లించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చదువు పూర్తి కాగానే అమెరికాకో, యూరప్‌కో వెళ్లాలనే మోజు యువతలో బలంగా నాటుకుపోయింది. విదేశీ జీతభత్యాలు ఆకర్షణీయంగా అనిపించినా, అది పరోక్షంగా మన దేశ మేధస్సును మరో దేశ అభివృద్ధికి ధారపోయడమే అవుతుంది. స్వదేశంలోనే ఉండి ఇక్కడి వనరులను ఉపయోగించుకుంటూ స్వయం ఉపాధిని ఎంచుకోవడం వల్ల అటు వ్యక్తిగత ఎదుగుదలతో పాటు, ఇటు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలవవచ్చు. ఒక్క అంకుర సంస్థ వందల మందికి ఉపాధిని కల్పిస్తుంది. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలను భారతీయులు నడిపిస్తున్నప్పుడు, భారత్‌లో అటువంటి సంస్థలను ఎందుకు నిర్మించలేమనే ప్రశ్న ప్రతి యువకుడిలో ఉదయించాలి. ప్రభుత్వాలు కూడా మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి పథకాల ద్వారా స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తున్నాయి. సాంకేతికత అందుబాటులోకి రావడంతో గ్రామీణ ప్రాంతాల్లో సైతం వినూత్న వ్యాపారాలకు అవకాశాలు పెరిగాయి. వ్యవసాయం, ఐటీ, తయారీ రంగం, సేవా రంగాల్లో యువత తమ సృజనాత్మకతకు పదును పెట్టాలి. రిస్క్ తీసుకోవడానికి వెనుకాడకుండా, సొంత గడ్డపైనే సామ్రాజ్యాలను నిర్మించే దిశగా అడుగులు వేయాలి. యువత కేవలం డిగ్రీల వేటలో పడకుండా, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి. విదేశీ వ్యామోహాన్ని వీడి, స్వదేశీ గడ్డపై స్వీయ శక్తితో ఎదిగినప్పుడే భారతదేశం విశ్వగురువుగా అవతరిస్తుంది. యువత ఆలోచన మారాలి.. వారి అడుగులు స్వయం ఉపాధి వైపు పడాలి. అప్పుడే నవభారత నిర్మాణం సాధ్యమవుతుంది.



## అక్షరాయుధుడు అంబేద్కర్

అంటరాని కులంలో ఉదయించిన కిరణం
అవమానాల కొలిమిలో మెరిసిన వజ్రం
కుల వివక్ష చీకటిని చీల్చిన శౌర్యం
అణగారిన బతుకుల్లో నింపిన ధైర్యం
చదువుకు అర్హత లేదన్న సమాజపు దైన్యం
ఎదిరించి నిలిచి చదువుకున్న వైనం ..

అవమానాన్ని భరించాడు.. అక్షరాన్ని ప్రేమించాడు
జ్ఞానపు సముద్రాన్ని తన మదిలో బంధించాడు.
అక్షరమే ఆయుధమని లోకానికి చాటాడు.
అణచివేత చీకటిలో వెలుగు దారిని చూపాడు.
తలవంచిన జాతికి.. తల ఎత్తుకు బతకడం నేర్పాడు.
హక్కుల సాధనకై కొరకు పోరాడమన్నాడు.

మన భారత భాస్కరుడు.. అంబేద్కరుడు
చరిత్ర పుటలలో చెరగని సంతకం
ఆయన లేని సమాజం అంధకార బంధురం.
బడుగుల భవితకు వెలుగు చూపిన తేజం
ఆయన మేధస్సు ప్రసాదించిన రాజ్యాంగం
నవ సమాజ నిర్మాణానికి అసలైన మార్గం..



గాదం అరుణ్ కుమార్
బీటెక్ సెకండ్ ఇయర్, వరంగల్,
సెల్ 6301783856

# వాన చుక్కలే.. ఎవుసపు బతుకులు!



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

తెలంగాణ రాష్ట్ర భౌగోళిక నిర్మాణం, వాతావరణ లక్షణాలు, వర్షపాతం పంపిణీ వంటి అంశాలు పరిశీలిస్తే వ్యవసాయం ప్రధానంగా వర్షాధారంగా కొనసాగుతున్నది స్పష్టమవుతుంది. రాష్ట్రంలో సుమారు 60% నుంచి 65% వరకు సాగుభూమి నేరుగా వర్షపాతం మీద ఆధారపడినది. ఈ పరిస్థితుల్లో వర్షాల అస్థిరత, వర్షపాతం లోపాలు, అధిక వర్షపాతం వల్ల వచ్చే నష్టాలు రైతుల జీవన విధానంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతున్నాయి. అందువల్ల వర్ష ఆధారిత వ్యవసాయాన్ని రక్షించడం మాత్రమే కాదు, దానిని స్థిరంగా అభివృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతగా నిలుస్తుంది. తెలంగాణలో సగటు వార్షిక వర్షపాతం సుమారు 700 మిల్లీమీటర్లు నుంచి 900 మిల్లీమీటర్ల మధ్య ఉంటుంది. ఇందులో దాదాపు 80% వర్షపాతం దక్షిణ పశ్చిమ రుతుపవనాల సమయంలో (జూన్ నుండి సెప్టెంబర్ వరకు) పడుతుంది. అయితే ఈ వర్షపాతం ప్రాంతానుసారం అసమానంగా ఉంటుంది. ఉదాహరణకు ఉత్తర తెలంగాణలో 900 మిల్లీమీటర్ల వరకు వర్షపాతం నమోదవుతుండగా, దక్షిణ ప్రాంతాల్లో ఇది 600 మిల్లీమీటర్లకు పడిపోతుంది. ఈ అసమానత వల్ల పంటల స్థిరత్వం తగ్గుతుంది. వర్షపాతం అనిశ్చితి , నేలలో తేమ నిల్వ లేకపోవడం, చెరువులు, కుంటలు పాడైపోవడం, భూగర్భజలాల అధిక వినియోగం, సాంకేతిక పరిజ్ఞానం లోపం, పంటల విభిన్నీకరణ లోపం తదితర సమస్యలు రైతుల ఆదాయాన్ని తగ్గిస్తున్నాయి. సుమారు 45% వరకు రైతులు వర్షపాతం లోపాల వల్ల నష్టపోతున్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. తెలంగాణలో చారిత్రకంగా చెరువు వ్యవస్థకు విశేష ప్రాధాన్యం ఉంది. సుమారు 46,000 చెరువులు రాష్ట్రంలో నమోదు అయ్యాయి. అయితే వీటిలో 30% వరకు చెరువులు పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. చెరువుల పునరుద్ధరణ జరిగితే 20% వరకు అదనపు సాగునీటి సామర్థ్యం పెరిగే అవకాశం ఉంది. ఇది వర్షాధార వ్యవసాయానికి బలమైన ఆధారంగా మారుతుంది. మిషన్ కాకతీయ వల్ల సాగు విస్తీర్ణం 15% వరకు పెరిగింది. నేలలో తేమ నిల్వ సామర్థ్యం 25% వరకు పెరిగినట్లు కొన్ని అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. ఇది వర్షాధార వ్యవసాయానికి బలమైన మద్దతు. అయితే, ఒకే పంటపై ఆధారపడటం ప్రమాదకరం. అందువల్ల రైతులు పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, మిల్లెట్లు వంటి పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయం 30% వరకు పెరిగే అవకాశం ఉంది. వ్యవసాయం బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్థిరపడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 70% జనాభా వ్యవసాయంపై ఆధారపడుతుంది.



తెలంగాణలో వర్షాధార వ్యవసాయం ఒక సవాలు అయినప్పటికీ, సరైన విధానాలు అమలు చేస్తే అది అవకాశంగా మారుతుంది. గ్రామీణ నీటి వనరుల పునరుద్ధరణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పంటల విభిన్నీకరణ, ప్రభుత్వ చొరవ కలిసివస్తే వ్యవసాయం స్థిరంగా అభివృద్ధి చెందుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడటంతో సమాజంలో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. దీర్ఘకాలిక దృష్టితో తీసుకునే నిర్ణయాలు మాత్రమే రైతుల భవిష్యత్తును సురక్షితం చేయగలవు. వర్షాధార వ్యవసాయ బలోపేతానికి సమగ్ర వ్యూహాలు అనే అంశాన్ని కొనసాగింపుగా పరిశీలించినప్పుడు తెలంగాణ గ్రామీణ నిర్మాణంలో నీటి వనరుల ప్రాధాన్యం మరింత స్పష్టంగా అవుతుంది. రాష్ట్రంలో సుమారు 60% నుంచి 65% వరకు వ్యవసాయం వర్షాలపై ఆధారపడటం వల్ల నీటి వినియోగాన్ని శాస్త్రీయంగా ప్రణాళిక చేయడం అత్యవసరంగా మారింది. గ్రామ స్థాయిలో జల బడ్జెట్ సిద్ధం చేయడం ద్వారా ఒక సంవత్సరంలో లభ్యమయ్యే వర్షపాతం పరిమాణం, భూగర్భజలాల స్థాయి, సాగుకు అవసరమైన నీటి పరిమాణం వంటి అంశాలను ముందుగానే అంచనా వేసే అవకాశం ఉంటుంది. ఈ విధానాన్ని అమలు చేస్తే నీటి వృథా వినియోగం సుమారు 25% వరకు తగ్గుతుందని వివిధ అధ్యయనాలు సూచిస్తున్నాయి. వర్షపు నీటి సంగ్రహణ పద్ధతులు గ్రామీణ ప్రాంతాల్లో మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది. ప్రతి ఇంటి పైకప్పు స్థాయిలో వర్షపు నీటిని నిల్వ చేసే విధానాలు అమలు చేస్తే భూగర్భజలాల స్థాయి 15% వరకు పెరిగే అవకాశముంది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, గోదాములు వంటి నిర్మాణాల్లో ఈ విధానాన్ని తప్పనిసరి చేస్తే సమగ్ర నీటి భద్రత సాధ్యమవుతుంది.

నేల సంరక్షణ కూడా వర్షాధార వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తుంది. నేలలో తేమ నిల్వ సామర్థ్యం పెరిగితే పంటల స్థిరత్వం గణనీయంగా పెరుగుతుంది. కాంటూర్ బండింగ్, మల్చింగ్, గ్రీన్ మాన్యూరింగ్ వంటి పద్ధతులు అమలు చేస్తే నేల తేమ నిల్వ 20% నుంచి 30% వరకు పెరుగుతుంది. భూసార పరిరక్షణ వల్ల దిగుబడులు స్థిరంగా ఉండటం మాత్రమే కాదు, పంటల నాణ్యత కూడా మెరుగుపడుతుంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ యాంత్రీకరణను గ్రామీణ స్థాయిలో విస్తరించడం అవసరం. చిన్న రైతులకు అనుకూలంగా యంత్రాల అద్దె కేంద్రాలు ఏర్పాటు చేస్తే వ్యవసాయ పనులు సమయానికి పూర్తి కావడం ద్వారా ఉత్పాదకత 15% వరకు పెరుగుతుంది. యాంత్రీకరణ వల్ల ఖర్చులు తగ్గడంతో పాటు శ్రమ కొరత సమస్య కూడా కొంతవరకు పరిష్కారమవుతుంది. వాతావరణ మార్పుల ప్రభావం వ్యవసాయంపై పెరుగుతున్న నేపథ్యంలో రైతులకు సమయానుకూల సమాచారం అందించడం అత్యంత కీలకం. మొబైల్ సాంకేతికత ఆధారంగా వర్షపాతం అంచనాలు, ఉష్ణోగ్రత మార్పులు, గాలివేగం వంటి వివరాలు రైతులకు అందిస్తే వారి నిర్ణయ సామర్థ్యం 35% వరకు మెరుగుపడుతుంది. వర్షాలు ఆలస్యమయ్యే పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, విత్తనాల మార్పు, సాగు కాలపట్టిక సర్దుబాటు వంటి చర్యలు సులభంగా అమలు చేయవచ్చు. వర్షాధార వ్యవసాయంలో ప్రమాదం ఎక్కువగా ఉండటం వల్ల వ్యవసాయ బీమా పథకాలు కీలక రక్షణగా నిలుస్తాయి. రైతుల్లో కనీసం 50% వరకు బీమా పరిధి పెరిగితే నష్టాల ప్రభావం గణనీయంగా తగ్గుతుంది. బీమా క్లెయిమ్ ప్రక్రియను డిజిటల్ పద్ధతిలో సులభతరం చేస్తే రైతులకు సమయానికి పరిహారం అందే అవకాశం ఉంటుంది. పశుసంవర్ధక రంగాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేయడం ద్వారా రైతుల ఆదాయం స్థిరంగా ఉంటుంది. పాలు, మాంసం, గుడ్లు వంటి ఉత్పత్తులు అదనపు ఆదాయ వనరులుగా మారి మొత్తం ఆదాయాన్ని 20% నుంచి 30% వరకు పెంచగలవు. మిశ్రమ వ్యవసాయం గ్రామీణ జీవన విధానంలో స్థిరత్వాన్ని తీసుకువస్తుంది. గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి కూడా వర్షాధార వ్యవసాయానికి అనుబంధంగా ఉండాలి. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ పెంచే విధంగా ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే రైతులకు మెరుగైన ధరలు లభిస్తాయి. నిల్వ గిడ్డంగులు, శీతల గిడ్డంగులు ఏర్పాటు చేస్తే పంట నష్టాలు తగ్గుతాయి. ఈ చర్యల వల్ల రైతుల ఆదాయం సుమారు 25% వరకు పెరుగుతుంది. మహిళల భాగస్వామ్యం గ్రామీణ అభివృద్ధిలో కీలక శక్తిగా నిలుస్తుంది. స్వయం సహాయక సంఘాల ద్వారా వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహిస్తే కుటుంబ ఆదాయం 15% వరకు పెరుగుతుంది. మహిళల ఆర్థిక స్వావలంబన గ్రామీణ సమాజంలో సామాజిక స్థిరత్వాన్ని పెంచుతుంది. యువతను వ్యవసాయంలోకి ఆకర్షించడం భవిష్యత్ అభివృద్ధికి అవసరం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ వ్యాపార నమూనాలు, స్టార్టప్ అవకాశాలు అందుబాటులో ఉంటే యువత వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకునే అవకాశం పెరుగుతుంది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించడంలో సహాయపడుతుంది. సహకార వ్యవస్థలు రైతుల బలోపేతానికి కీలకంగా నిలుస్తాయి. రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా సమూహంగా విత్తనాల కొనుగోలు, ఉత్పత్తుల విక్రయం నిర్వహిస్తే ఖర్చులు తగ్గి లాభాలు 20% వరకు పెరుగుతాయి. సమూహ శక్తి రైతులకు మార్కెట్‌లో మెరుగైన స్థానం కల్పిస్తుంది. ప్రభుత్వ పాలనలో పారదర్శకత వర్షాధార వ్యవసాయ అభివృద్ధికి కీలక అంశంగా నిలుస్తుంది. డిజిటల్ పద్ధతుల ద్వారా పథకాల అమలు పర్యవేక్షణ జరిగితే నిధుల వినియోగం సమర్థవంతంగా ఉంటుంది. రైతులకు నేరుగా లబ్ధి చేరే విధంగా విధానాలు రూపొందించాలి. భవిష్యత్తు వ్యూహాలను పరిశీలించినప్పుడు 2030 నాటికి వర్షాధార వ్యవసాయాన్ని 20% వరకు స్థిరంగా మార్చే లక్ష్యంతో కార్యక్రమాలు రూపొందించాల్సిన అవసరం ఉంది. 2040 నాటికి నీటి వినియోగ సామర్థ్యాన్ని 50% వరకు పెంచే విధంగా సాంకేతికతను విస్తరించాలి. 2050 నాటికి వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల మార్పిడి వ్యవస్థను పూర్తిస్థాయిలో అమలు చేయడం అత్యవసరం.

సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వర్షాధార వ్యవసాయానికి కొత్త అవకాశాలను తెరుస్తుంది. వాతావరణ సమాచారం రైతులకు సమయానికి అందితే పంటల ప్రణాళికలో కచ్చితత్వం పెరుగుతుంది. మొబైల్ ఆధారిత సేవలు, డిజిటల్ వ్యవసాయ సలహాలు రైతుల నిర్ణయ సామర్థ్యాన్ని 35% వరకు మెరుగుపరుస్తాయి. తక్కువ నీటితో పెరిగే పంటలు, పొడి పరిస్థితులను తట్టుకునే విత్తనాలు, మైక్రో ఇరిగేషన్ విధానాలు వంటి సాంకేతిక పద్ధతులు నీటి వినియోగాన్ని 40% వరకు తగ్గించగలవు. ఈ మార్పులు వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తాయి. సరైన విధానాలు, సమగ్ర ప్రణాళిక, ప్రజల భాగస్వామ్యం, సాంకేతిక వినియోగం కలిసివస్తే వ్యవసాయం స్థిరంగా అభివృద్ధి చెందుతుంది.

# అవమానాలే రాజ్యాంగ లిఖితాక్షరాలై..!

అంబేద్కర్ తల్లిదండ్రులు బీమా భాయ్, తండ్రి రాంజీసక్ పాల్. వీరిది మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా. రాంజీసక్ పాల్ మధ్యప్రదేశ్‌లో ఉద్యోగం చేశారు. అక్కడ "మౌ" అనే గ్రామంలో పద్నాలుగవ సంతానంగా అంబేద్కర్ జన్మించారు. అంబేద్కర్ చిన్నప్పటి నుంచి పఠనాభిలాషి, ఆలోచనాపరుడు. ఎవరేమన్నా ఎదిరించే ధైర్య సాహసాలు కలవారు. చదువుకోవ డానికి బడికి వెళ్తే దూరంగా కూర్చోబెట్టా రు.. మంచినీళ్ల కోసం బావి దగ్గరికి వెళ్తే ముట్టరాదన్నారు. ప్రయాణం కోసం బండి ఎక్కితే మధ్యలో దించి అవమానించారు. అయినా ఒడిదుడుకులన్నీ ఎదుర్కొని ఆత్మవిశ్వాసంతో ముందడిగేసి . అనేక అవమానాలు ఎదుర్కొంటూనే 1907 లో మెట్రిక్యులేషన్ పూర్తి చేశాడు. మరాఠీ రచయిత కేలూస్కార్, గౌతమ బుద్ధుని జీవిత చరిత్రను బహుమతిగా ఇచ్చి అంబేద్కర్‌ను ఉన్నత విద్య చదివేందుకు ప్రోత్సహించారు. ప్రపంచానికి అహింసా సిద్ధాంతాన్ని బోధించిన బౌద్ధం నుండే స్వేచ్ఛ, సమాన త్వం, సౌభ్రాతృత్వం అనే విలువైన మాటల్ని గ్రహించానని అంబేద్కర్ ప్రకటించారు. ఈ అంశాలు ప్రతి ఒక్కరికి లభించిన నాడే సామాజిక న్యాయం జరుగుతుందని ఆకాంక్షించారు. పుస్తక పఠనాన్ని లండన్ లైబ్రరీలోని గ్రంథాలెన్నింటినో చదివారు. న్యాయవాద వృత్తిలో ప్రవేశించి ఒకవైపు పేదలందరికీ న్యాయం అందిస్తూనే మరోవైపు అట్టడుగు వర్గాల వారి అభ్యున్నతి కోసం శ్రమించారు. ముంబై లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యునిగా నామినేట్ అయి వివిధ సమావేశంలో కమిటీల్లో కీలకపాత్రను పోషించారు. సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన అంబేద్కర్ విద్యకు, అత్యంత ప్రాధాన్యమి చ్చారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుతోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆ రోజుల్లోనే కాంక్షించిన దార్శనికుడు అంబేద్కర్. తన వంటి వారం దరికో సమన్యాయం దక్కాలని శ్రమించిన రాజ్యాంగ రూపశిల్పి, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్. ఆయనలోని ఆత్మవిశ్వాసం, నిరాడంబరత, ప్రతిఘటనా చైతన్య, నిరంతర పఠనాభిలాషి, సునిశిత పరిశీలన, తపన నేటి బాలబాలికలకు, అత్యంత అవసరం. ఆత్మగౌరవానికి ఎనలేని ప్రాధాన్యమిచ్చిన అంబేద్కర్.. గంభీరథ, సున్నితత్వం కలగలిగిన గొప్ప మానవతవాది.



దేవులపల్లి రమేశ్
సిద్దిపేట, నంగునూర్
9963701294

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.